దాతల సాయం.. ఆదరణ మాయం!



దుర్గగుడికి వచ్చే దివ్యాంగ భక్తులు, వృద్ధుల కోసం దాతలు అందజేసిన వీల్‌ఛైర్స్ దేవదాయ శాఖ అధికారులు మూలన పడేశారు. మహామండపంలో భక్తులు దర్శనం అనంతరం కిందకు దిగే మెట్ల మార్గంలో వీటిని పడేశారు. చిన్నపాటి మరమ్మతులు చేసి.. వీటిని వినియోగంలోకి తెస్తే... దసరా వేళ ఎందరికో ఉపకరిస్తాయి. - ఈనాడు, అమరావతి

భక్తులు దిగే మార్గం సిద్ధం!




దసరా ఉత్సవాల వేళ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్న తర్వాత... కొండపై నుంచి కిందకు దిగేందుకు ఈసారి శివాలయం మెట్ల మార్గం లేదు. దీంతో తాత్కాలిక మెట్ల మార్గాన్ని సిద్ధం చేశారు. కొండపై నుంచి ఈ మెట్ల మార్గం ద్వారా భక్తులు కిందకు దిగనున్నారు. భారీ పరిమాణంలో ఇనుప మెట్లను తయారు చేయించి తీసుకొచ్చి అమర్చారు. శివాలయం మెట్ల మార్గం పక్కనే సిమెంట్‌తో కొంత భాగం వరకూ మెట్లు కట్టాక.. అక్కడి నుంచి ఈ ఇనుప మెట్లకు అనుసంధానించారు. - ఈనాడు, అమరావతి

పైసలిస్తే.. పట్టని ప్రణాళికే..!

అక్రమ నిర్మాణాలకు.. వారే దన్ను
ఐదేళ్లుగా వైకాపా ప్రజాప్రతినిధుల అండ
పట్టణ ప్రణాళిక విభాగం సహకారంతో దందా
అయినా బదిలీల వేళ వారిని కదపని దారుణం

ఈనాడు, అమరావతి

విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఐదేళ్ల జగన్ పాలనలో అక్రమ భవన, అనుమతి లేని అంతస్తుల నిర్మాణాలు విచ్చలవిడిగా జరిగాయి. నగరంలోని వైకాపా ప్రజాప్రతినిధుల అండతో ఏటా కనీసం 100 నుంచి 150కు పైగా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ప్రధానంగా గాంధీనగర్, బీసెంట్‌రోడ్డు, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, వన్‌టౌన్ సహా అన్ని ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో విచ్చలవిడిగా.. అనుమతిలేని అంతస్తుల నిర్మాణం జరిగాయి.



ఒక్కో అంతస్తుకు ఆ ప్రాంతాన్ని బట్టి.. రూ.5-15 లక్షల వరకూ విచ్చలవిడిగా వసూళ్లకు పాల్పడ్డారు. గత మూడేళ్లుగా పరిస్థితి మరింత పెచ్చుమీరింది. పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది, వైకాపా కీలక ప్రజాప్రతినిధులు కలిసి.. రూ.కోట్లలో దండుకున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై.. వైకాపా కార్పొరేటర్లు, ఎమ్మెల్యేల మధ్య అనేక వివాదాలు చెలరేగాయి. ఐదేళ్లలో.. 500పైనే అక్రమ భవన, అంతస్తుల నిర్మాణాలు యథేచ్ఛగా నగరంలో జరిగినట్టు తెలుస్తోంది.

మినహాయింపు ఎందుకు..?

నగరంలో అక్రమ నిర్మాణాల పరంపర ఇప్పటివరకూ యథేచ్ఛగా కొనసాగింది. గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా దండుకున్న పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బందే ఉండడంతో అక్రమాలు కొనసాగాయి. తాజాగా పట్టణ ప్రణాళిక విభాగం ప్రక్షాళనలో భాగంగా ఈనెల 22న అనేక మందిని ఇక్కడి నుంచి బదిలీ చేశారు. కానీ.. గతంలో జరిగిన అక్రమ నిర్మాణాల్లో కీలకంగా చక్రం తిప్పిన కొందరు సిబ్బందికి మాత్రం తాజా బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వడంపై ప్రస్తుతం తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బదిలీల నేపథ్యంలో సిఫార్సులు, డబ్బులు ముట్టచెప్పి వీళ్లు ఇక్కడి నుంచి కదలకుండా ఉండిపోయినట్టు విమర్శలున్నాయి. నగరంలో ఒకేసారి విధుల్లో చేరిన వారిలోనూ కొందరిని బదిలీ చేసి, కొందరిని వదిలేయడంపైనా విమర్శలు వస్తున్నాయి. నగరపాలక సంస్థల్లో రెండేళ్లు పైబడి ఉన్న వారందరినీ తాజాగా బదిలీలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అలాంటప్పుడు ఒకేసారి ఇక్కడ బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు దాటిన కొందరికి ఎందుకు మినహాయింపు ఇచ్చారనేది ప్రస్తుతం అనుమానాలకు దారితీస్తోంది.





కొందరినే బదిలీ చేయడమేంటో..

నగరపాలక సంస్థ పరిధిలో ఆశా, రమణారెడ్డి, కృష్ణ అనే ముగ్గురు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు(టీపీవో) రెండున్నరేళ్ల కిందట ఒకేసారి విజయవాడలో విధుల్లో చేరారు. కానీ.. వీళ్లలో ఆశా, రమణారెడ్డిని వేర్వేరు ప్రాంతాలకు బదిలీ చేశారు. కృష్ణను మాత్రం ఇక్కడే ఉంచారు. ఐదేళ్లుగా ఇక్కడే పాతుకుపోయిన కొండలరావు, అరుణ, శేషశైలజను కూడా బదిలీ చేశారు. మతిన్ అనే మరో ఉద్యోగి నాలుగేళ్లుగా విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోనే పనిచేస్తున్నారు. పట్టణ ప్రణాళిక విభాగ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా చేరి.. ఇక్కడే పదోన్నతి పొంది.. ఇప్పుడు టీపీఎస్ (టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్)గా విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్కరికీ ఒక్కో రకంగా బదిలీల విషయంలో వ్యవహరించడంపై ప్రస్తుతం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీరిలో కొందరిపై గత రెండేళ్లలో అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. అయినా.. వారిని ఒక వార్డు నుంచి మరో వార్డుకు మార్చడం, కాపాడుకుంటూ రావడం.. వంటివే చేస్తుండడం గమనార్హం. ఒక ఉద్యోగి గతంలో వన్‌టౌన్ ప్రాంతంలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలకు సహకరించాడని ఆరోపణలు రావడంతో.. అతడిని టూటౌన్‌కు మార్చారు. ఇప్పటికీ అక్కడే కొనసాగిస్తున్నారు.

సుపరిచితులే.. అపరిచితులు!

బందరులోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతోందా బాలిక. ఈనెల 6న సాయంత్రం బడి వదిలాక స్నేహితురాలిని కలిసేందుకు వెళ్లి.. తిరిగొస్తోంది. ఓ యువకుడు ఆమెను అడ్డగించి బైక్‌పై నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి.. అఘాయిత్యం చేశాడు. మానసిక క్షోభ అనుభవించలేక వారం తర్వాత ఆమె ఇంట్లో చెప్పింది.

విస్సన్నపేట మండల విద్యార్థిని ఇంటర్ చదువుతోంది. అదే గ్రామ యువకుడు ప్రేమిస్తున్నానని వెంటపడేవాడు. ఈనెల 14న ఆమె కళాశాల నుంచి వెళ్తుండగా మధ్యలో ఓ భవనంలోకి తీసుకెళ్లి దారుణానికి ఒడిగట్టాడు. మరుసటి రోజు బాధితురాలు తల్లికి వివరించగా..నిందితుడిపై పోక్సో కేసు పెట్టారు.

ఆగస్టు 3న భవానీపురంలో ఓ ప్రధానోపాధ్యాయుడు పదోతరగతి విద్యార్థినితో అసభ్యంగా మాట్లాడాడు. సాయంత్రం కంప్యూటర్ గదికి తీసుకెళ్లి వేధించాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఈనాడు డిజిటల్, అమరావతి

విస్సన్నపేట మండలంలో ఓ గ్రామంలో ఈనెల 14న తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లడంతో ఇంట్లో బాలిక ఒంటరిగా ఉంది. ఇదే అవకాశంగా అదే గ్రామానికి చెందిన 40 ఏళ్ల వ్యక్తి బలవంతంగా ఇంటి వెనుకకు లాక్కెళ్లి అకృత్యానికి పాల్పడ్డాడు. తర్వాత బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇలాంటి సంఘటనలు ఉమ్మడి కృష్ణా జిల్లాలో తరచూ జరుగుతున్నాయి. ప్రస్తుత సమాజంలో అమ్మాయిలకు ఎటువైపు నుంచి ఎప్పుడు ఏ ఆపద వస్తుందో తెలియట్లేదు. ఇటీవలి ఘటనలు పరిశీలిస్తే సుపరిచితులతోనే బాలికలకు ముప్పు పొంచి ఉన్నట్లు స్పష్టం అవుతోంది. ప్రేమని మాయమాటలు చెబుతున్నారు. నమ్మించి ఏకాంత ప్రదేశాలకు తీసుకెళ్లి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. చెంపలు తడుముతుంటే.. ముద్దు చేస్తున్నారని అనుకుంటున్నారే తప్ప రాక్షసుల కామ వాంఛను గ్రహించడంలేదు. అందుకే తల్లిదండ్రులు మేల్కోవాలి. పిల్లలకు 'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్' ఏదో తెలియజేయాలి.

తల్లిదండ్రులదే బాధ్యత..

పిల్లల భవిష్యత్తు విషయంలో ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశంలోనూ అవగాహన కల్పించడానికి అంతకన్నా ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ఇందులో ఆలస్యం జరగకూడదు. లేదంటే.. వారి జీవితంలో ఎక్కడైనా.. ఎప్పుడైనా ఇది పెను సమస్యగా మారి వేధిస్తుంది. పిల్లలకు ఎవరి వద్దయినా అసౌకర్యంగా అనిపిస్తే వెంటనే వారి గురించి ఇంట్లో చెప్పమని చెప్పాలి. వారికేదైనా చేదు అనుభవం ఎదురై ఉంటే సున్నితంగా, మెల్లగా అడిగి సమస్య తెలుసుకొని పరిష్కరించాలి.

ఉపాధ్యాయినుల పాత్ర కీలకం...

లైంగిక దాడులకు గురవుతున్న వారిలో గ్రామీణ బాలికలే అధికంగా ఉంటున్నారు. పేద కుటుంబాల పిల్లలు కావడం.. మంచి తిండి, డబ్బులకు ఆశగా చూస్తున్న ఎదురుచూపులను ఆసరాగా చేసుకొని పలువురు బరి తెగిస్తున్నారు. ఈనేపథ్యంలో గ్రామీణ పిల్లల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ఉపాధ్యాయినులపైనే ఎక్కువగా ఉంది. సమాజంలో జరుగుతున్న దుర్ఘటనలు చెప్పడంతోపాటు... శరీరంలో ఎక్కడెక్కడ తాకితే వ్యతిరేకించాలో అర్థమయ్యేలా తెలియజేసి చైతన్యపరచాలి. శరీరానికి సంబంధించి సొంతంగా కొన్ని నియమాలు ఉంటాయని పిల్లలకు తెలియాలి. వాటిని ఇతరులు అతిక్రమిస్తున్నప్పుడు స్పందించడమే కాదు.. తక్షణం వ్యతిరేకించడమెలాగో నేర్పించాలి.

మానసిక ధైర్యం అవసరం..



దగ్గర వాళ్లనుంచే అధికంగా అఘాయిత్యాలు జరుగుతున్నాయి. తల్లిదండ్రులు చిన్నతనం నుంచి శారీరక దృఢత్వం, తమని తాము రక్షించుకునేందుకు కరాటే, బాక్సింగ్, తైక్వాండో వంటివి నేర్పించాలి. ఉపాధ్యాయులు పాఠాలతో పాటు నైతిక విలువలు, సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలు, వాటి నుంచి బయటపడే మార్గాల గురించి వివరించాలి. బాలికలతో అసభ్యంగా ఎవరైనా ప్రవర్తిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి.

- ముక్తేవి ఫణిప్రసాద్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు




కాపాడుతుందా.. కష్టపెడుతుందా?!

రహదారులపై ప్రమాదాలు.. అనుమానిత వాహనాల రాకపోకలు.. తరచూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే మనుషులు... ఇలాంటి వాటిని సీసీ కెమెరాలు నిక్షిప్తం చేసి అనేక కోణాలలో పోలీసులకు.. నేర పరిశోధనలో, నేరస్థులను గుర్తించడానికి ఉపయోగపడతాయి. కానీ ఈచిత్రం చూడండి... విజయవాడ రామకృష్ణాపురం నుంచి దేవీనగర్ వెళ్లే మార్గంలో రహదారిపై అడ్డంగా స్తంభం వేసి దానికి కెమెరాలను అమర్చారు. వాహనదారులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా.. సీసీ కెమెరాలతో రక్షణ మాట దేవుడెరుగు.. వాటిని ఢీకొని ప్రమాదాల బారిన పడే అవకాశమే ఎక్కువ. తక్షణమే ఆ స్తంభాన్ని రహదారిపై నుంచి పక్కకు జరపాలని స్థానికులు కోరుతున్నారు. - ఈనాడు, అమరావతి

పర్యాటక అవార్డుల ప్రదానం

భవానీపురం, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పలువురికి పర్యాటక అవార్డులను ముఖ్యమంత్రి చంద్రబాబు అందజేశారు. విజయవాడకు చెందిన పలు హోటల్స్, సంస్థలకు అవార్డులు లభించాయి. ఉత్తమ 3 స్టార్ హోటల్‌గా హోటల్ మినర్వ గ్రాండ్‌కు, ఉత్తమ రెస్టారెంట్‌గా జింగ్-హయత్ ప్లేస్, ఉత్తమ స్టాండ్ ఎలోన్ రెస్టారెంట్‌గా యునైటెడ్ తెలుగు కిచెన్, ఉత్తమ చెఫ్‌గా (ఆంధ్రా క్యూజిన్) కనికెళ్ల చంద్రశేఖర్ (ఫార్చ్యూన్ మురళీ పార్క్), ఉత్తమ ట్రావెల్ ఏజెంట్‌గా ట్రావెలీ క్యూ గ్లోబల్ సొల్యూషన్స్, ఉత్తమ అడ్వెంచర్ టూర్ ఆపరేటర్‌గా ది అమరావతి బోటింగ్ క్లబ్, ఉత్తమ ఎమెర్జింగ్ ట్రావెల్ కంపెనీ ప్రమోటింగ్ ఏపీ టూరిజంగా అతిథి హాలిడేస్‌లకు అవార్డులు లభించాయి.



ఉత్తమ రెస్టారెంట్‌గా జింగ్-హయత్ ప్లేస్ ప్రతినిధికి పురస్కారం అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. పక్కన మంత్రి కందుల దుర్గేష్ తదితరులు

రుణం కింద.. నష్టపరిహారం జమ చేయొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, పక్కన శ్రీధర్, పూర్ణిమ తదితరులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: వరద బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం మంజూరు చేసి నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసిందని, ఆ సొమ్మును రుణం కింద పరిగణించవద్దని, ఒకవేళ ఆటో డెబిట్ అయితే లబ్ధిదారుడిని స్వయంగా పిలిచి ఆ మొత్తాన్ని నగదు రూపంలో అందించాలని కలెక్టర్ జి.సృజన బ్యాంకు అధికారులకు సూచించారు. 'అందినట్టే అంది.. చేజారింది' శీర్షికన ఈనెల 27న 'ఈనాడు' కథనం ప్రచురించింది. స్పందించిన కలెక్టర్ బ్యాంక్ అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని ప్రకటించి నేరుగా డీబీటీ ద్వారా వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. నష్టపోయిన 90 వేల కుటుంబాలతో పాటు వ్యాపార, వాణిజ్య, ఆస్తి నష్టాలకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని పారదర్శకంగా లబ్ధిదారులకు అందించేందుకు వారి బ్యాంకు ఖాతాల్లో వేస్తున్నట్లు తెలిపారు. సర్వస్వాన్ని కోల్పోయి ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులను మానవతా దృక్పథంతో ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఈ విషయంలో బ్యాంకుల భాగస్వామ్యం కూడా అవసరమని అన్నారు. జమ చేసిన సొమ్ము రుణ చెల్లింపు కిందకు వెళ్లినట్లు గుర్తిస్తే.. బ్యాంకు అధికారులు లబ్ధిదారులకు సమాచారం ఇచ్చి తిరిగి వారికి నగదు రూపంలో అందించి ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కించాలని సూచించారు. తగిన చర్యలు తీసుకుంటామని బ్యాంకర్లు తెలిపారు. ఎల్‌డీవో పీఎం పూర్ణిమ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) రీజినల్ హెడ్ ఎం.శ్రీధర్, ఎల్‌డీఎం కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

తేల్చమంటే.. తేల్చేశారు..!

అక్రమాల లోతుల్లోకి వెళ్లకుండా నామమాత్ర విచారణ
గత ప్రభుత్వ కీలక వ్యక్తుల అండతోనే తొక్కిపెట్టిన తీరు
ప్రభుత్వ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీలో మరుగున వాస్తవాలు

ఈనాడు, అమరావతి

ప్రభుత్వ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీలో అక్రమాలకు అడ్డుకట్ట పడలేదు. అవకతవకలు తేల్చాల్సిన విచారణలోనూ వాస్తవాలు వెలుగులోకి రాలేదు. ఉద్దేశపూర్వకంగా పలు కీలక అంశాలను తొక్కిపెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. విచారణ అధికారి నివేదిక అసమగ్రంగా ఉందనీ, కొన్నింటిని అసలు పరిశీలించలేదని రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ (ఆర్సీఎస్) అభిప్రాయపడ్డారు. దీనిపై దర్యాప్తులో స్పృశించని కొన్ని ముఖ్యాంశాలపై అదనపు నివేదిక కోరారు. ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండలో శ్రీహరిపురం ప్రభుత్వ ఉద్యోగుల కాలనీలో రూ.కోట్లలో జరిగిన అక్రమాలను 'ఈనాడు' వరుస కథనాలతో నిరుడు వెలుగులోకి తెచ్చింది. స్పందించిన అధికారులు విచారణకు ఆదేశించారు. దీనిపై ఆశలు పెట్టుకున్న సభ్యులు.. విచారణ నివేదిక చూసి ఖంగుతిన్నారు. సూత్రధారులకు.. గత ప్రభుత్వంలో కీలక వ్యక్తుల అండ ఉండడమే కారణమనే విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలనీ, వాస్తవాలను వెలుగులోకి తేవాలని సభ్యులు కోరుతున్నారు.



విస్మరించిన అసలు అంశాలు

★ సంఘ సభ్యులు కాని 41 మందికి ప్లాట్లను కేటాయించారు. సహకార చట్టం ప్రకారం ఇతరులకు ప్లాట్లను అమ్మడం చట్టవిరుద్ధం. ★ సభ్యుల నుంచి రిజిస్ట్రేషన్ రుసుము కింద వసూలు చేయాల్సిన మొత్తం కన్నా రూ.2.50 కోట్లు అదనంగా వసూలు చేశారు. దీనిపై విచారణాధికారి సరైన నివేదిక ఇవ్వలేదు. అదనంగా వసూలు చేసిన మొత్తం సంఘానికే జమ చేసినందున. నిధుల దుర్వినియోగానికి తావులేదన్నారు. కానీ నష్టపోయిన సభ్యులకు ఎలా న్యాయం చేయాలో చెప్పలేదు. ★ భూయజమానులకు సొమ్ము చెల్లించకుండా ముందు తేదీల (పోస్ట్ డేటెడ్) చెక్కుల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీనిని దాచి.. చట్టబద్ధత లేని దస్తావేజుల ద్వారా సభ్యులను మోసం చేసి ప్లాట్లు అంటగట్టారు. సభ్యుల నుంచి వసూలు చేసిన సొమ్ము భూ యజమానులకు చెల్లించకుండా ఇతర అవసరాలకు మళ్లించారు. ప్లాట్ల అమ్మకం పూర్తయ్యాక ఆరుగురు రైతులు తమకు రూ.50 కోట్లు చెల్లించలేదని కోర్టుకెళ్లారు. వ్యాజ్యం వేసిన వారితో సంప్రదింపులు జరిపి.. పరిష్కరించుకోవాలని విచారణాధికారి సూచించడం గమనార్హం.

సమాధానాల్లేని ప్రశ్నలు....

★ సంఘ నిర్వహణలో మితిమీరిన ఖర్చు చేశారు. రూ.44 లక్షలకు ఓచర్లు లేకుండానే లెక్క చూపారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన అధ్యక్షుడిపై క్రిమినల్ చర్యలు కానీ అదనంగా ఖర్చు చేసిన మొత్తం వసూలుకు బాధ్యులనూ గుర్తించలేదు. అధ్యక్షుడిపై తగు చర్యలను మాత్రమే సూచించారు. ★ లే ఔట్‌లో మౌలిక వసతులకు కేటాయించిన భూమిని ప్రైవేటు ఫైనాన్స్ సంస్థకు తాకట్టుపెట్టడం..అక్రమమో.. సక్రమమో తేల్చలేదు. సీఆర్డీఏ నిబంధనల ప్రకారం.. లే ఔట్ ఆమోదానికి.. వసతులకు స్థలాల కేటాయింపు తప్పనిసరి. ★ సభ్యుల తొలగింపుపై కూడా అస్పష్ట వైఖరే. అక్రమాలను ప్రశ్నించిన 29 మంది సభ్యులు ప్లాట్ల యాజమానులైనా వారి సభ్యత్వాలు రద్దు చేశారు. దీనిపై ఫిర్యాదుల పరిష్కార కమిటీ వేయాలని సూచించారు.

ఏదీ తేల్చకుండా వదిలేశారు...

ఫిర్యాదులో అంశాలను దర్యాప్తులో పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవడం దర్యాప్తు అధికారి ప్రాథమిక బాధ్యత. కానీ కర్తవ్యాన్ని విస్మరించి.. జనరల్ బాడీ ఆమోదం పొందినందున కొన్ని అంశాలపై తదుపరి చర్యలు అవసరం లేదని పేర్కొన్నారు. కోరం లేకపోయినా బోగస్ సంతకాలతో సమావేశాలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. కోరం లేకపోవడంతో ఈనెల 14న జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. దీనికి పరిశీలకుడిగా విజయవాడ డీఎల్‌సీవో కిరణ్ కుమార్ హాజరయ్యారు. తదుపరి ఈనెల 29న జరగాల్సిన సమావేశానికి పరిశీలకులు వచ్చే వీల్లేనందున బోగస్ సంతకాలతో తతంగం నడిపేలా రంగం సిద్ధం చేస్తున్నారనే విమర్శలున్నాయి. సభ్యులు హైకోర్టులో కేసులు దాఖలు చేసిన అంశాలను న్యాయ పరిధిలో ఉన్నాయని ఏదీ తేల్చకుండా కేవలం సూచనలిచ్చి వదిలేయడం గమనార్హం. నిధుల దుర్వినియోగం జరిగిందీ లేనిదీ పేర్కొనలేదు.

నూతన ఏసీపీల బాధ్యతల స్వీకరణ

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం ఉదయం ఇద్దరు ఏసీపీలు నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. నార్త్ ఏసీపీగా డాక్టర్ కె.స్రవంతిరాయ్, ట్రాఫిక్ ఏసీపీ 1గా పి.రామచంద్రరావు తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జరిగిన డీఎస్పీల సాధారణ బదిలీల్లో సీసీఎస్ ఏసీపీగా ఉన్న డాక్టర్ కె.స్రవంతిరాయ్‌ను ఏసీపీ నార్త్‌గా, డీఎస్పీ వెయిటింగ్‌లో ఉన్న రామచంద్రరావును ట్రాఫిక్ ఏసీపీ 1గా బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం వీరు పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.



స్రవంతిరాయ్ రామచంద్రరావు

ఎన్టీటీపీఎస్‌లో బదిలీలు

ఎన్టీటీపీఎస్(ఇబ్రహీంపట్నం), న్యూస్‌టుడే : ఎన్టీటీపీఎస్‌లో బదిలీల ప్రక్రియ వేగవంతమైంది. దశాబ్ద కాలం తర్వాత ఇంజినీరింగ్ అధికారుల బదిలీలు చోటు చేసుకోవడం సంస్థలో చర్చనీయాంశంగా మారింది. వివిధ దశల్లో ఉన్న సహాయక, డివిజన్, సూపరింటెండెంట్ ఇంజినీరులకు స్థానభ్రంశం కలిగింది. పలు దశల్లో ఉన్న యూనిట్లు ఉత్పాదనలో సాంకేతిక లోపాలు తలెత్తి నిలిచిపోవడంతో పాటు ఈ నెలలో వచ్చిన వరదల సమయంలో ప్లాంట్‌లో దాదాపు ఉత్పాదన నిలిచిపోయే పరిస్థితులపై యాజమాన్యం స్పందించింది. అందులో భాగంగానే పదేళ్లకు పైగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న అధికారులతో పాటు పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై బదిలీ వేటు పడింది. ఈ క్రమంలో రాయలసీమ థర్మల్‌కు అధిక మంది బదిలీ అయ్యారు. మరికొందర్ని ఇతర దశల్లోకి మార్పు చేశారు. పదుల సంఖ్యలో బదిలీలు చోటు చేసుకోవడంతో ప్రక్షాళన జరుగుతుందని అందరూ భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సూర్యాపేట: జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలైన ఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలం మాధవరం వద్ద చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన విద్యాధరపురానికి చెందిన నలుగురు వ్యక్తులు హైదరాబాద్ నుంచి విజయవాడకు బొలేరో వాహనంలో వెళ్తున్నారు. మాధవరం వద్ద వాహనం అదుపు తప్పి జాతీయ రహదారి వెంట ఉన్న ఇనుప గ్రిల్స్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో వాహనంలో ఉన్న రాంబాబు(60) తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. ఆయనతో పాటు ప్రయాణిస్తున్న రోషిబాబు, క్రాంతికుమార్, రమణలకు గాయాలు కావడంతో చికిత్స కోసం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. శవపరీక్ష నిమిత్తం రాంబాబు మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో రూ.లలో)

ఏపీలో: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 లేయర్ ధర 149 విత్ స్కిన్ లెస్ -207, విత్ స్కిన్ - 238. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 విత్ స్కిన్ - 250 లైవ్ స్కిన్‌లెస్ - 280.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 530 (వాణిజ్య & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

అమ్ముకోలేక.. ఉంచుకోలేక..

- రోజురోజుకూ పడిపోతున్న మిర్చి ధర
- శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన రైతుల ఆవేదన



గోదాముల్లో అమ్మకానికి ఉంచిన మిర్చి బస్తాలు

నందిగామ, న్యూస్‌టుడే

ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చికి ధర వస్తుందనే ఆశతో శీతల గిడ్డంగుల్లో రైతులు నిల్వ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ధర పెరగకపోగా... అంతకంతకూ తగ్గడంతో రైతులు నష్టపోయారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు పెట్టుబడులకు మిర్చి విక్రయించేందుకు అన్నదాతలు ప్రయత్నిస్తున్నారు. సరైన ధర లేక ఆందోళన చెందుతున్నారు. శీతల గిడ్డంగుల అద్దెలు, ఇతర ఖర్చులకు అదనంగా చెల్లించాల్సి ఉండటంతో మరింత నష్టపోతున్నారు. కల్లాల్లోనే అమ్మితే గిట్టుబాటు అయ్యేదని వాపోతున్నారు.

45 వేల ఎకరాల్లో...

ఎన్టీఆర్ జిల్లాలో గత ఖరీఫ్‌లో 45 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. నర్సరీల్లో నారు కొనుగోలు చేసి నాటారు. ఎకరానికి రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టారు. ఎకరాకు రూ. 25 వేల వరకు కౌలుకు వెచ్చించారు. పైర్లకు తెగుళ్లు ఆశించడం, అధిక వర్షాల వల్ల ఎకరానికి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. సాధారణంగా ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. పైగా కోత కూలీ ఖర్చులు భారీగా పెరిగాయి. కల్లాల్లో పంట ఉండగా రకాలు, నాణ్యతకు అనుగుణంగా క్వింటా రూ.13 వేల నుంచి రూ.18 వేల వరకు కొనుగోలు చేశారు. నాణ్యత ప్రకారం తేజ రకం రూ. 17 వేల నుంచి రూ. 20 వేల వరకు ఉండటంతో కొందరు విక్రయించారు. మిగిలిన వారు ధర పెరుగుతుందనే ఆశతో శీతల గిడ్డంగుల్లో నిల్వ చేశారు.

☛ నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో 16 శీతల గిడ్డంగుల్లో సరకు నిల్వ చేశారు. ప్రస్తుతం వ్యవసాయ పెట్టుబడుల సమయం. సరకు విక్రయించడానికి అన్నదాతలు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల వరదలు రావడంతో ధరలు ఒక్కసారిగా తగ్గిపోయాయి. ప్రస్తుతం శీతల గిడ్డంగుల వద్ద ఆర్మూరు రకం రూ.13 వేలు, తేజ రకం రూ.17 వేల నుంచి రూ. 18 వేలు, ఇతర రకాలు రూ.12 వేల నుంచి రూ. 16 వేలు వరకు ధర పలుకుతోంది. కల్లాల్లో ధర ఇప్పుడు లేకపోగా క్వింటాకు రూ.వెయ్యి నుంచి రూ.3 వేలు తగ్గిందని రైతులు చెబుతున్నారు.

ఖర్చుల భారం

శీతల గిడ్డంగుల్లో మిర్చి టిక్కీలు నిల్వ చేసినందుకు క్వింటాకు రూ.450, రవాణా, కూలీల ఖర్చు, వడ్డీ కలిపితే క్వింటాకు మరో రూ.1500 వరకు అవుతుంది. ధర పెరగకపోవడం వల్ల అద్దెలు, ఇతర ఖర్చులు కలుపుకొని క్వింటాకు రూ.2 వేలు వరకు నష్టపోతున్నామని రైతులు తెలిపారు. ప్రస్తుతం అమ్మినా.. గిట్టుబాటు కాదని, ధర పెరుగుతుందనే ఆశతో కొందరు ఉంచుతున్నారు.

13న గుంటూరులో ఇండియా పోస్ట్ రన్-2024

కృష్ణలంక, న్యూస్‌టుడే: జాతీయ తపాలా వారోత్సవాల సందర్భంగా అక్టోబర్ 13న గుంటూరులో ఇండియా పోస్ట్ రన్- 2024 నిర్వహిస్తున్నట్లు విజయవాడ రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి తెలియజేశారు. విజయవాడలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఫిట్ ఇండియా, ఫిట్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ప్రతిఒక్కరిని ఆరోగ్యంపై పునరాలోచింపజేయడమే పోటీల లక్ష్యమని చెప్పారు. 3కే, 5కే, 10కే విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 5కె, 10కె పురుష, మహిళా విభాగాల్లో విజేతలకు రూ.2,40,000 నగదు రివార్డులు అందించనున్నట్లు చెప్పారు. గుంటూరు ఆంధ్రా లూథరన్(బీఈడీ) కళాశాల వద్ద అక్టోబర్ 13వ తేదీ 6 ఉదయం గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. 10కేలో పాల్గొనదలచిన వారు రూ.500, 5కేకు రూ.400, 3కేకు రూ.300 చెల్లించి అక్టోబర్ ఏడో తేదీలోగా https:///indiapostrunap.iq301.com వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు నగదు బహుమతులను అదే రోజు సాయంత్రం ఆంధ్రా లూథరన్ కళాశాల వద్ద అందిస్తామన్నారు. అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ జనరల్ కందుల సుధీర్‌బాబు, ఎస్పీవోస్ గుంటూరు డివిజన్ యు.యలమందయ్య పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పోస్ట్‌మాస్టర్ జనరల్ మూర్తి, పక్కన సుధీర్‌బాబు, యలమందయ్య

రైతులకు అందని నష్ట పరిహారం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

పంట నష్టపరిహారం అందలేదని మాగల్లు గ్రామ సచివాలయంలో శుక్రవారం బాధిత రైతులు వీఏఏ రామకృష్ణారెడ్డిని నిలదీశారు. వరదకు మునిగిన పంట పొలాలకు పరిహారం అందలేదని, బాగున్న పొలాల పరిహారం మంజూరైందని వీఏఏను ప్రశ్నించారు. పొలాలను పరిశీలించకుండా కొందరు నాయకులు చెప్పిన ప్రకారం జాబితా రూపొందించారని ఆరోపించారు. కొంతమందికి ఒక్కో ఆధార్ కార్డుకు అయిదెకరాల వంతున 20 ఎకరాలకు పైగా నష్టపరిహారం మంజూరైందని, ఎకరం, అరెకరం సాగు చేసిన రైతులకు మాత్రమ మొండిచెయ్యి చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు నిలదీస్తున్నా వీఏఏ నుంచి సరైన సమాధానం రాలేదు.

ముఖ్యమంత్రికి ఫిర్యాదు: పంట నష్టం నమోదులో వ్యవసాయ శాఖ అధికారులు అవకతవకలకు పాల్పడ్డారని కొండూరు, మాగల్లు గ్రామాలకు చెందిన బాధిత రైతులు శుక్రవారం సీఎం చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ కమిషనర్, కలెక్టర్‌కు ఫిర్యాదు పంపారు. స్థానిక వ్యవసాయ అధికారులపై విచారణ చేయాలని డిమాండు చేశారు. కొండూరులో కౌలుదారుడు సాగు చేస్తున్న పొలాన్ని వేరొకరు సాగు చేస్తున్నట్లు రాశారని, పంట సాగుకు వీలుపడని చౌప్పదొడ్డిని పొలంగా చూపారని, అక్రమార్కులు, అధికారులు కుమ్మక్కై సుబాబుల్‌ను కూడా నమోదు చేసి పరిహారం దోచుకున్నారని ఆరోపించారు. పంట నష్టపోయినా తమ పేర్లు నమోదు చేయలేదని రైతులు చెరుకూరి సునీత, తోట కనకయ్య, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, జీవనమూర్తి, మేడ నరేష్, మేడి ప్రభాకర్, అప్పికట్ల దాసు తదితరులు ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలని కోరారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రక్తదానం ప్రాణదానంతో సమానమని, అపోహలు విడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సీనియర్ డీఎస్సీ వల్లేశ్వరరావు బి తోకల సూచించారు. 'ఆర్పీఎఫ్ రైజింగ్ డే' సందర్భంగా శుక్రవారం రైల్వే ఆస్పత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సకాలంలో రక్తం దొరక్క ప్రతి రోజూ ఎంతో మంది చనిపోతున్నారని తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన ఆర్పీఎఫ్ సిబ్బందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఏఎస్సీ మధుసూదనరావు, ఏసీఎంఎస్ డాక్టర్ జయదీప్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధి ఐ.సత్యనారాయణశర్మ, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రైల్వే పరిసరాల్లో పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ కోరారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రైల్వే ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన 'వేస్ట్ టు ఆర్ట్' ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించే లక్ష్యంతో 2014లో ప్రారంభించిన స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమాన్ని విజయవాడ డివిజన్‌లో విజయవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. విజయవాడతో పాటు డివిజన్ వ్యాప్తంగా పరిశుభ్రత డ్రైవ్‌లు, అవగాహన ర్యాలీలు, విస్తృత స్థాయిలో ప్రచారాలు, స్వచ్ఛతా ప్రతిజ్ఞలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రైల్వే పరిసరాల్లో మొక్కలు నాటినట్లు తెలిపారు. వేస్ట్ పరికరాలను రీసైక్లింగ్ చేసేందుకు 'వేస్ట్ టు ఆర్ట్' ప్రాజెక్టు వంటి సృజనాత్మక కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రదర్శించిన నాటకం, నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు కొండా శ్రీనివాసరావు, పీఈ వర్గీస్, డీఈఎన్(హెచ్‌ఏ) ఎం.కిషోర్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్, ఏడీఆర్ఎంలు

హైదరాబాద్, బెంగళూరు టికెట్ ఛార్జీలపై 10 శాతం రాయితీ

విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే: విజయవాడ నుంచి హైదరాబాద్, బెంగళూరు నడుపుతున్న ఏపీఎస్ఆర్టీసీ డాల్ఫిన్ క్రూయిజ్, అమరావతి బస్సుల్లో ఈనెల 27 నుంచి వచ్చే నెల 5 వరకు ఆదివారం (అప్), శుక్రవారం (డౌన్)లను మినహా మిగిలిన రోజుల్లో ఛార్జీలపై 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.వై దానం శుక్రవారం ప్రకటన ద్వారా తెలిపారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు డాల్ఫిన్ క్రూయిజ్, అమరావతి బస్సుల్లో ఎంజీబీఎస్‌కు ఆదివారం సాధారణ ఛార్జీ రూ. 770, మిగిలిన రోజుల్లో రూ. 700, తదుపరి ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఆదివారం సాధారణ ఛార్జీ రూ. 830 ఉండగా మిగిలిన రోజుల్లో రూ. 750గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చేటప్పుడు శుక్రవారం సాధారణ ఛార్జీ, మిగిలిన రోజుల్లో రాయితీ ఛార్జీ వసూలు చేస్తారు. విజయవాడ నుంచి బెంగళూరు వెళ్లే వెన్నెల స్లీపర్ ఏసీ బస్సుల్లో ఆదివారం మెజిస్టిక్ బస్టేషన్ వరకు సాధారణ ఛార్జీ రూ. 2170, మిగిలిన రోజుల్లో 1970, ఆపై ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఆదివారం రూ. 2210, మిగిలిన రోజుల్లో రూ. 2010, అమరావతి మల్టీ యాక్సిల్ బస్సుల్లో ఆదివారం మెజిస్టిక్ బస్టేషన్ వరకు సాధారణ ఛార్జీ రూ.1870, మిగిలిన రోజుల్లో 1700, ఆపై ప్రాంతాలకు ఆదివారం సాధారణ ఛార్జీ 1930, మిగిలిన రోజుల్లో రూ. 1750 గా రాయితీ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

గుండె సంరక్షణపై అవగాహనకు 5కె వాక్‌థాన్

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ఈ నెల 29న ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా కార్డియాలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ ఛాప్టర్ ఆధ్వర్యంలో వాక్ ఫర్ హార్ట్ ..లవ్ యు ఆంధ్రప్రదేశ్ పేరుతో 5కె వాక్‌థాన్ నిర్వహించనున్నారు. కార్యక్రమానికి సంబంధించిన లోగోను ఛాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ జాన్ సతీష్, ఉపాధ్యక్షుడు డాక్టర్ జె.శ్రీమన్నారాయణ, కోశాధికారి డాక్టర్ ఎ.పూర్ణానంద్ టిక్కిల్ రోడ్డులోని ఓ హోటల్లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హృదయ సంబంధింత వ్యాధులు, గుండె సంరక్షణ పట్ల ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 29న (ఆదివారం) ఉదయం 6 గంటలకు శారదా కళాశాల నుంచి వాక్‌థాన్ ప్రారంభమై బీఆర్టీఎస్ రోడ్డు వరకు కొనసాగుతుందని వివరించారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ప్రారంభిస్తారని తెలిపారు. నగర ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



లోగో ఆవిష్కరిస్తున్న గుండె వైద్యనిపుణులు సతీష్, శ్రీమన్నారాయణ, పూర్ణానంద్

మున్సిపల్ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ నేడు

మచిలీపట్నం కార్పొరేషన్: విజయవాడ, మచిలీపట్నం నగర పాలక సంస్థలతోపాటు గుడివాడ పురపాలక సంఘ పరిధిలోని స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ ఉపాధ్యాయులకు శనివారం మచిలీపట్నంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈవో తాహెరా సుల్తానా ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగోన్నతులు, రివర్షన్‌కు ఉదయం 10.30గంటలకు కౌన్సిలింగ్ ప్రారంభిస్తామన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు అందరూ హాజరు కావాలని కోరారు.

విరిగి పడిన కొండరాళ్లు

చిట్టినగర్, న్యూస్‌టుడే: రైల్వే పశ్చిమ బుకింగ్ సమీపంలోని ముసాఫిర్ ఖానా వెనుక భాగంలో ఇటీవల కురిసిన వర్షాలకు కొండచరియలు విరిగి పడిపోయాయి. ముసాఫిర్ ఖానా వెనుక ఏర్పాటు చేసిన ఐరన్ ఫ్రేమ్‌లను సైతం నెట్టుకుని రాళ్లు పడ్డాయి. పక్కనే ఉన్న కొలకలూరి ఫంక్షన్ భవనం కూడా దెబ్బతిన్నది. రాళ్లు దొర్లి పడడంతో తెలుసుకున్న తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్ ఆ ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లామని వివరించారు. కొండ భాగంలో కొండ రాళ్లు తగిలే వరకు తవ్వి రక్షణ గోడ కట్టేవిధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఆయన చెప్పారు.



జారిపడిన కొండరాళ్లను పరిశీలిస్తున్న తెదేపా నాయకులు బేగ్

కట్లేరు వంతెనపై రాకపోకలు నిలిపివేత



వరదలో నడిచి వెళ్తున్న ప్రయాణికులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని వినగడప సమీపంలోని కట్లేరు వంతెనపై శుక్రవారం సాయంత్రం నుంచి రాకపోకలు నిలిపేసినట్లు ఎస్సై ఎస్.శ్రీను తెలిపారు. గురువారం అర్ధరాత్రి ఎగువున కురిసిన వర్షాలకు వరద నీరు కట్లేరుకు చేరి వంతెన వద్ద మళ్లింపు రహదారిపై ప్రవహిస్తోంది. దీంతో ఆ నీటిలోనే ప్రజలు ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. అప్రమత్తమైన పోలీసులు రాకపోకలు ఆపేసి బందోబస్తు ఏర్పాటు చేశారు. వరద తగ్గితే శనివారం ఉదయం నుంచి ప్రయాణించేందుకు అనుమతిస్తామని చెప్పారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 85005 44088 మైలవరం: 80085 74705

విద్యుత్తు స్తంభం ఏర్పాటు

స్పందనకు వందనం

స్థానిక మునగపాడు బైపాస్‌లో వరదల కారణంగా విద్యుత్తు స్తంభం పొలంలోకి ఒరిగిపోయి ప్రమాదకరంగా మారిందని స్థానికులు 'ఈనాడు' దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఈ నెల 24న సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్తు శాఖ సహాయక ఇంజినీరు సీహెచ్. రామ్మోహన్‌రావు సిబ్బందితో నూతన విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

తిరువూరు, న్యూస్‌టుడే : స్థానిక జగన్నాథపురంలో 400 ఏళ్ల చరిత్ర కలిగిన దాసాంజనేయ స్వామి ఆలయం పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన కొల్లిపర సుబ్బారావు, విజయలక్ష్మి దంపతుల కుమార్తె, అల్లుడు బొగ్గరపు ఆదిచెంచులక్ష్మి, గురుప్రసాద్ రూ.35 వేలు విరాళం ప్రకటించారు. శుక్రవారం విరాళం మొత్తాన్ని ఆలయ ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబుకు అందజేశారు.

పరామర్శ


కవిత ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న ఉండవల్లి శ్రీదేవి

తిరువూరు, న్యూస్‌టుడే : ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అనుచిత వ్యాఖ్యలతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు యత్నించి విజయవాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిట్టేల సర్పంచి తుమ్మలపల్లి శ్రీనివాసరావు భార్య కవితను మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి శుక్రవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడి కవిత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

నియంత్రణకు చర్యలు చేపట్టడంలో జాప్యమెందుకు?


సమస్యలు ప్రస్తావిస్తున్న తెదేపా సభ్యులు అబ్దుల్‌హుస్సేన్, సురేంద్ర

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలో శునకాలు, కోతుల నియంత్రణకు నిధులు కేటాయించి చర్యలు చేపట్టడంలో జాప్యమెందుకు చేస్తున్నారని తెదేపా సభ్యులు షేక్ అబ్దుల్‌హుస్సేన్, నాళ్లా సురేంద్ర అధికారులను నిలదీశారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో ఛైర్‌పర్సన్ జి.కస్తూరిబాయి అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. వీటి నియంత్రణకు చర్యలు చేపట్టాలని పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తాము విజ్ఞప్తి చేస్తూనే ఉన్నామని, చివరకు పట్టణవాసులు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేస్తున్నారంటే సమస్య తీవ్రతకు అద్దం పడుతుందని పోడియం ఎదుట నిరసన తెలిపారు. కమిషనర్ జి.లోవరాజు వివరణ ఇస్తూ కేటాయించిన రూ.2 లక్షలు సరిపోకపోవడం వల్లే జాప్యం జరిగిందని, అదనంగా నిధులు కేటాయించి త్వరలోనే సమస్య పరిష్కారిస్తామని తెలిపారు. పట్టణ ప్రధాన రహదారిలో ప్రజలు స్వచ్ఛందంగా డ్రెయిన్ల పూడిక తీసుకుంటే ప్రభుత్వం మంజూరు చేసిన రూ.26 లక్షలు ఎవరి జేబుల్లోకి వెళ్లాయని ప్రశ్నించారు. అనంతరం అజెండాలో చేర్చిన అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు.

వసతుల కల్పనతో సమస్యల పరిష్కారం


కాలనీ వాసులతో మాట్లాడుతున్న కమిషనర్ రమ్యకీర్తన

కొండపల్లి, న్యూస్‌టుడే : మౌలిక వసతులు కల్పనతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని కమిషనర్ రమ్యకీర్తన అన్నారు. కొండపల్లి జగనన్న కాలనీలో రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థ, విద్యుత్తు సౌకర్యం లేదంటూ స్థానికులు పురపాలిక కార్యాలయం వద్ద రెండ్రోజుల క్రితం నిరసన తెలిపారు. దీనిపై స్పందించిన కమిషనర్, కార్యాలయ అధికారులు కాలనీని శుక్రవారం సందర్శించారు. కాలనీవాసులతో మాట్లాడారు. రోడ్ల నిర్మాణాలకు అంచనాలు వేశారని, త్వరలోనే వాటి ఏర్పాటు ఉంటుందన్నారు. మురుగు నీటి పారుదలకు కాలువల నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. వీటికి అంచనాలు రూపొందించి పంపుతామన్నారు. విద్యుత్తు సౌకర్యంకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయం తీసుకొంటుందన్నారు. ఏఈ సాయిగణేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఉద్యోగాలు మంజూరు చేయాలి


ప్రదర్శనలో మజ్దూర్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : గుంటుపల్లి వ్యాగన్ వర్క్‌షాపులో పెరిగిన పనిభారానికి అనుగుణంగా నూతన ఉద్యోగాలు కల్పించక యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులను నియమించుకుని శ్రమ దోపిడీకి పాల్పడుతుందని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకరరావు ఆరోపించారు. మజ్దూర్ యూనియన్ గుంటుపల్లి వ్యాగన్ వర్క్‌షాపు శాఖ అధ్యక్షుడు తమ్మా సుబ్బారెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం వర్క్‌షాపు కాలనీల్లో నాయకులు, కార్మికులతో కలిసి ప్రదర్శన చేశారు.

అరకొర బస్సులు.. ప్రయాణానికి అవస్థలు

న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం


కొండపల్లిలో సిటీ బస్సు ఎక్కేందుకు తోసుకుంటున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం, కొండపల్లి నుంచి విజయవాడకు ఉదయం సిటీ బస్సులు అవసరమైన మేరకు లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల నుంచి నగర పరిసర ప్రాంతాల్లోని కళాశాలలకు, కార్యాలయాలకు వెళ్లే వారికి ఈ బస్సులే ఆధారం. దీంతో పాటు ఉదయం ఇబ్రహీంపట్నం కూడలి నుంచి కంచికచర్ల వైపు కూడా పల్లెవెలుగు, ప్యాసింజర్ సర్వీసులు అరకొరగానే ఉన్నాయి. ఈ క్రమంలో కేతనకొండ, కంచికచర్లలోని ఇంజినీరింగు కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

పరిమితికి మించి ఎక్కడం ప్రమాదం

మైలవరం, జి.కొండూరు గ్రామాలతో పాటు ఇబ్రహీంపట్నం కొండపల్లికి చెందిన ఇంజినీరింగు విద్యార్థులు బస్సుల కోసం ఇబ్రహీంపట్నం కూడలి వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. కళాశాలలకు సమయం మించిపోతుందన్న ఆత్రుతతో ఏదో ఒక్క సమయంలో వచ్చిన బస్సుల్లో పరిమిత సంఖ్యకు మించిన వారు ఎక్కుతున్నారు. తప్పని పరిస్థితుల్లో నిబంధనలకు విరుద్ధంగా పుట్‌బోర్డు ప్రయాణం చేయాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఏ ప్రమాదం పొంచి ఉంటుందోనని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఉదయం కొండపల్లి నుంచి విజయవాడ వైపు సిటీ సర్వీసులను, ఇబ్రహీంపట్నం కూడలి నుంచి కంచికచర్ల వైపు పల్లెవెలుగు సర్వీసులను అదనంగా నిర్వహించాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

అదనపు సర్వీసులు అవసరం

కొండపల్లి నుంచి ఉదయం విజయవాడ ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీ వైపునకు ఒక్క సిటీ సర్వీస్ మాత్రమే ఉంది. దాని తర్వాత గంట వరకు బస్సే లేదు. అందులో మాతో పాటు ఉద్యోగస్థులు, ప్రయాణికులు అదనంగా ఉంటారు. దీంతో నిలబడేందుకు కూడా స్థలం లేక పుట్‌బోర్డు ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఆ సమయంలో విజయవాడ కాళేశ్వర మార్కెట్ వరకు అయినా మరో సర్వీసు ఏర్పాటు చేస్తే ప్రయోజనంగా ఉంటుంది.

–ఎస్‌కే ఆహ్మద్, ఎస్ఆర్‌ఆర్ కాలేజీ విద్యార్థి

పరుగెత్తుకెళ్లి ఎక్కలేకపోతున్నాం

ఇబ్రహీంపట్నం- కంచికచర్ల మధ్య గతంలో ఉదయం 8.30 గంటలకు విజయవాడ నుంచి నందిగామకు పల్లెవెలుగు బస్సు ఉండేది. ప్రస్తుతం దాన్ని రద్దు చేశారు. దీంతో జగ్గయ్యపేట, కోదాడ బస్సులు ఎక్కాల్సి వస్తోంది. బస్సు డ్రైవర్లు విద్యార్థులను గమనించి వీరందరూ పాస్‌లున్న వారంటూ స్టాంపులకు దూరంగా నిలుపుతున్నారు. మేము పరుగెత్తుకెళ్లి బస్సులు ఎక్కలేక పోతున్నాం. కళాశాల సమయాలకు అనుగుణంగా ఇబ్రహీంపట్నం సెంటరు నుంచి నందిగామ వరకు పల్లె వెలుగు బస్సు ఏర్పాటు చేయాలి.

– ఎన్.రామశాస్త్రి, కేతనకొండ ఆర్‌కే కాలేజీ విద్యార్థి

★ **దీనిపై ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజరు సుబ్రహ్మణ్యం వివరణ ఇస్తూ** ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా డిపో ముంపునకు గురైందని తెలిపారు. దీంతో డిపోలోని అత్యధిక బస్సులు వరద నీటిలో మునగడంతో మరమ్మతులకు గురయ్యాయని చెప్పారు. వాటిని బాగు చేస్తున్నాం. పూర్తికాగానే ఉన్నతాధికారుల సూచనల మేరకు అదనపు సర్వీసులు నడుపుతాం.

అనుచిత వ్యాఖ్యలపై ఆందోళన


నిరసన వ్యక్తం చేస్తున్న జన సైనికులు

తిరువూరు, న్యూస్‌టుడే : ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై మాజీ మంత్రి పేర్ని నాని చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జన సైనికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. స్థానిక బోసుబొమ్మ కూడలి వద్ద పేర్ని నానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పేర్ని నాని చిత్రపటాన్ని చెప్పులతో కొట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాధ్యతల స్వీకరణ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : స్థానిక వెలుగు ఏపీఎంగా బి.రామకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అగిరిపల్లి మండలంలో పని చేస్తూ రెడ్డిగూడెం మండలానికి బదిలీపై వచ్చారు. గతంలో ఆయన ఇక్కడ పని చేశారు. కూనపరాజుపర్వ క్లస్టర్ సీసీగా ఎస్.సుందరమ్మ, రెడ్డిగూడెం క్లస్టర్ సీసీగా ఎం.మణి బాధ్యతలు స్వీకరించినట్లు ఏపీఎం తెలిపారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : నెమలి వేణుగోపాల స్వామి ఆలయ సహాయ కమిషనర్‌గా నేల సంధ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కూడా రెండేళ్ల పాటు ఈమె దేవాలయ ఏసీగా పని చేశారు. కృష్ణాజిల్లా సహాయ కమిషనర్‌గా ఉన్న ఈమెను ఇక్కడికి బదిలీ చేశారు.

'ఎమ్మెల్యే కొలికపూడిపై చర్యలు తీసుకోండి'

తిరువూరు, న్యూస్‌టుడే : పాత్రికేయులను, సొంత పార్టీ నాయకులను పరుష పదజాలంతో దూషిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై తెదేపా అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లాం తాంతియా కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొలికపూడి తీరుతో తెదేపా సర్పంచి భార్య ఆత్మహత్యాయత్నం చేయడం తనను బాధించిందన్నారు. ఐదేళ్ల పాటు అరాచకాలు, అక్రమాలు సాగించిన జగన్‌కు పట్టిన గతే ఎమ్మెల్యే కొలికపూడికి పడుతుందని హెచ్చరించారు. చట్టసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక ప్రజాప్రతినిధిని అనే విషయాన్ని మరిచి ఇలా ప్రవర్తిస్తున్న ఎమ్మెల్యేను సస్పెండ్ చేయాలని కోరారు. పాత్రికేయులపై చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటూ ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత


బాధితురాలికి చెక్కు అందిస్తున్న రవికుమార్, రామకృష్ణ తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని వెలగలేరుకు చెందిన సానం తిరుపతమ్మ అనారోగ్యంతో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.87,758 చెక్కు మంజూరు కాగా తెదేపా మండల అధ్యక్ష, కార్యదర్శులు పజ్జూరు రవికుమార్, లంకా రామకృష్ణ, స్థానిక నాయకులు మంచినేని రాజశేఖర్, కిలారు వెంకటరత్నం, జమ్ముల శేషగిరిరావు, రవి, వంశీకృష్ణలతో కలిసి శుక్రవారం వెలగలేరులో ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.

మృతుడి కుటుంబానికి సాయం

జి.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని వెంకటాపురానికి చెందిన ప్రత్తిపాటి కార్తీక్ చిత్తూరు జిల్లా నాయుడుపేట వద్ద జరిగిన లారీ ప్రమాదంలో మృతి చెందారు. ఈ మేరకు తెదేపా మండల అధ్యక్ష, కార్యదర్శులు పజ్జూరు రవికుమార్, లంకా రామకృష్ణ, వెంకటాపురం గ్రామ అధ్యక్షుడు కేసర వెంకటేశ్వరరెడ్డితో కలిసి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.13 వేలను ఆర్థిక సాయం అందించారు. కుప్పిరెడ్డి పుల్లారెడ్డి, వెంకటస్వామి, రమేష్, ప్రసాద్, మధురెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాలు విడుదల.. అన్నదాతలకు ఊరట

న్యూస్‌టుడే, గంపలగూడెం


మధిర బ్రాంచి కెనాల్‌లో ప్రవహిస్తున్న నీరు

ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర శాఖ కాల్వకు సాగర్ జలాలు విడుదల చేశారు. ఆయకట్టులో సాగు చేసిన పంటలకు తడులు అందించేందుకు నీరు సరఫరా చేయడంతో అన్నదాతలు ఊరట చెందారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ ఏడాది ఆగస్టు రెండో పక్షంలో వారం రోజులు కాల్వలకు సాగర్‌జలాలు విడుదలయ్యాయి. తదుపరి రెండో జోన్‌లోని మధిర బ్రాంచి కెనాల్‌కు నెల రోజులుగా నీటి సరఫరా లేదు. ఫలితంగా ఆయకట్టులో సాగు చేసిన పత్తి, మిరప, వరి తదితర పంటలు ఎండుముఖం పట్టాయి. ఈ నెల మొదటి వారంలో కురిసిన అధిక వర్షాలతో పది రోజుల పాటు సాగర్ జలాల అవసరం ఏర్పడలేదు. తదుపరి వేసవిని తలపించే ఎండలతో భూమిలో తేమశాతం తగ్గిపోయింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో ఉన్న నీటిని కాల్వలకు విడుదల చేసి పంటలను కాపాడాలని పక్షం రోజులుగా రైతులు కోరుతున్నారు.


తడి అందించాల్సిన మిరప తోట

అధికారులు పర్యవేక్షించాలి..

ఈ నేపథ్యంలో శుక్రవారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక వద్ద మధిర బ్రాంచి కెనాల్‌కు 727 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు సాయంత్రానికి 294 క్యూసెక్కులు చేరాయి. దీంతో మధిర శాఖ కాల్వల పరిధిలోని గంపలగూడెం, పెదకొమిర, నిదానపురం, ఊటుకూరు, మధిర మేజర్ల ద్వారా ఆయకట్టు రైతులకు సాగర్ జలాలు సరఫరా చేస్తామని ఏఈలు సత్యరవికిషోర్, మహేష్ తెలిపారు. వారం రోజుల పాటు కాల్వలకు నీటి సరఫరా జరుగుతుందని చెప్పారు. ఈ నీటితో ఆయా పంటలకు తడులు అందించవచ్చని కర్షకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మేజర్లకు సరఫరా చేసే నీరు చివరి భూములకు చేరే వరకు అధికారులు పర్యవేక్షించాల్సి అవసరం ఎంతైనా ఉంది.

తిరువూరు నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సు

గంపలగూడెం, న్యూస్‌టుడే : తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి గంపలగూడెం, నెమలి, వైరా, ఖమ్మం మీదుగా హైదరాబాద్‌లోని మియాపూర్‌కు సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును ఆదివారం రాత్రి నుంచి నూతనంగా ప్రారంభిస్తున్నట్లు మేనేజర్ ఎ.వేణు శుక్రవారం తెలిపారు. ప్రతిరోజు రాత్రి 8.45 గంటలకు తిరువూరులో బయల్దేరి ఉదయం 5.15 గంటలకు మియాపూర్ చేరుకుంటుందని చెప్పారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్టీఆర్ అభిమానుల సంబరాలు



జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' చిత్రం విడుదల సందర్భంగా శుక్రవారం మైలవరంలో ఆయన అభిమానులు సంబరాలు నిర్వహించారు. స్థానిక సంఘమిత్ర థియేటర్ వద్ద బాణాసంచా కాల్చి, కేకు కోసి అభిమానులకు పంచారు. జూనియర్ ఎన్టీఆర్ చిత్రాలతో ద్విచక్ర వాహనాలపై ప్రదర్శన చేసి సందడి చేశారు. - న్యూస్‌టుడే, మైలవరం

మండల సమాఖ్య కార్యవర్గం

మైలవరం, న్యూస్‌టుడే : దీపికా మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏపీఎం శ్యామ్యూల్ తెలిపారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బుద్దె జ్యోతి, బాణావత్ సక్కుబాయి, కోశాధికారిగా ఎస్.లక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా ఎం.రత్నకుమారి, సంయుక్త కార్యదర్శిగా పూజల రమాదేవిలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మైలవరంలో...


ఇబ్రహీంపట్నం: ప్రదర్శనలో విద్యార్థులు, అధికారులు

మైలవరం, న్యూస్‌టుడే : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఇళ్లా రవి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు మానవహారం నిర్వహించారు. స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. వైస్ ప్రిన్సిపల్ రంగారావు, పలువురు అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని కొండపల్లి పురపాలిక కమిషనర్ రమ్య కీర్తన అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం విజయవాడ ఆధ్వర్యంలో నిమ్రా, లక్కిరెడ్డి బాలిరెడ్డి కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్లు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నం ఫెర్రీలో శుక్రవారం నిర్వహించాయి.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న రవీంద్రనాథ్

గొల్లపూడి, న్యూస్‌టుడే : హమాలీల సమస్యలను పరిష్కరించాలని, వారి కూలీ రేట్లను పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ పేర్కొన్నారు. గొల్లపూడిలోని స్టాక్ పాయింట్ వద్ద కార్మికులు నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ హమాలీలకు కనీస వేతన చట్టం ప్రకారం చెల్లింపులు చేయాలని, కూలీ రేట్లు పెంచాలని కోరారు.

స్కేటింగ్ పోటీల్లో విద్యార్థికి బంగారు పతకం

ఇబ్రహీంపట్నం గ్రామీణం: సీబీఎస్ఈ సౌత్ జోన్ కోయంబత్తూరులో ఈ నెల 18 నుంచి 22 వరకు నిర్వహించిన జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో గుంటుపల్లి డాన్‌బాస్కో పాఠశాల విద్యార్థి విజయ్ డానియేల్ బంగారు పతకం సాధించాడు.

విఘ్నేశ్వరునికి 108 ప్రసాదాల నైవేద్యం


రాజుపేట గణనాథుని ఎదుట పెట్టిన ప్రసాదాలు

తిరువూరు, న్యూస్‌టుడే : స్థానిక రాజుపేటలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొలువైన విఘ్నేశ్వరునికి శుక్రవారం భక్తులు 108 ప్రసాదాలు నైవేద్యంగా సమర్పించారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తబృందాల ఆధ్వర్యంలో గీతాలు ఆలపించి భజనలు చేశారు.

అష్టోత్తర శత దీపాలంకరణ సేవ

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి అర్చకులు అష్టోత్తర శత దీపాలంకరణ సేవ వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు విశేష పూజలు చేశారు.

రైతుల శ్రేయస్సుకు కృషి


వీరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దేవినేని

గొల్లపూడి, న్యూస్‌టుడే : రైతుల శ్రేయస్సు కోసం, చివరి ఆయకట్టు వరకు సాగు నీటిని అందించేందుకు నీటి పారుదల రంగ నిపుణుడు చెరుకూరి వీరయ్య కృషి చేశారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. వీరయ్య వర్ధంతిని స్థానిక కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. వీరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కొనకళ్లకు అభినందన

గొల్లపూడి, న్యూస్‌టుడే : ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ, కృష్ణాజిల్లా తెదేపా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావుకు విజయవాడ గ్రామీణ మండలం తెదేపా అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్నరామారావు, ఉపాధ్యక్షులు వేములకొండ నాగరాజు, మైలవరం మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ఉయ్యూరు నరసింహారావు అభినందించారు.

భగత్‌సింగ్, ఏబీ బర్దన్‌కు నివాళి


తిరువూరులో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు


ఎ.కొండూరులో ఏబీ.బర్దన్ చిత్రపటానికి..

తిరువూరు, న్యూస్‌టుడే : స్థానిక సుంకర వీరభద్రరావు భవన్‌లో ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్దన్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎం.ఉదయ్, ఎస్‌కే నాగుల్‌మీరా, షేక్ సుభాని, టి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏబీ.బర్దన్ జయంతి సందర్భంగా ఎ.కొండూరులో ఆయన చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

జి.కొండూరు, న్యూస్‌టుడే : జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీల్లో జి.కొండూరు ఎస్ఎస్ఆర్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటి ఉమ్మడి కృష్ణాజిల్లా తరఫున రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీలత ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. అండర్-19లో పదో తరగతికి చెందిన జాహ్నవి, శశి, ప్రియాంక, కృప, యామిని ఎంపికైనందుకు, వీరికి శిక్షణ ఇచ్చిన పీడీ ఆర్ సీజర్‌రెడ్డి, పీఈటీ కె.మాధవరావులను ఆమెతో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ


న్యాయస్థానం ఎదుట ధర్నా చేస్తున్న న్యాయవాదులు

తిరువూరు, న్యూస్‌టుడే : ఏపీ అడ్వకేట్ యాక్టు- 2017లోని అధికరణలములు ప్రతిపాదించి అమలు తెచ్చేందుకు చేస్తున్న ప్రయత్నం విరమించుకోవాలని తిరువూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాకదాని లక్ష్మీనారాయణ, షేక్ గౌసుద్దీన్ డిమాండ్ చేశారు. సవరణ ప్రతిపాదనలపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేస్తూ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించారు. స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే

ఇసుక మాఫియా కన్ను కోతులవాగుపై పడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా 30 ఏళ్ల తర్వాత ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులో పెద్ద ఎత్తున ఇసుక మేటలు వేసి ఉద్ధృతంగా పొంగి గ్రామంలోకి వరద నీరు చేరింది. దీంతో భారీ వర్షం పడిన తెల్లవారే ఆ నీటిలోనే ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తుండగా రెవెన్యూ, పోలీస్ అధికారులు వాటిని పట్టుకున్నారు. కొందరు అధికార పార్టీ నాయకులు అధికారులకు నచ్చచెప్పి వదిలిపెట్టే విధంగా చేశారని సమాచారం. ఈ నేపథ్యంలో మరల గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు 100 పైగా ట్రాక్టర్లు వాగులో నీరు ఉన్న ఇసుకను తోడి యథేచ్ఛగా తరలిస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విశేషం. దీంతో ట్రాక్టర్ ఇసుకను రూ.2,500 అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అత్యవసరంగా కావాలని ఎవరైన అడిగితే ఇంకా ఎక్కువ రేటుకు అమ్ముతున్నారు.


కోతులవాగులో బారులు తీరిన ట్రాక్టర్లు

శుక్రవారం ఇసుక తరలింపు ప్రదేశానికి కొందరు పోలీసులు వెళ్లి మంతనాలు చేసి వచ్చారని సమాచారం. అధికార పార్టీ నాయకులు అండతోనే ఈ మాఫీయా జరుగుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని వెలగలగూడెంలో వాగులో ఇసుక తరలిస్తున్నారని రెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ ఫోను వచ్చినట్లు తెలిసింది. రెండు వర్గాలు మధ్య ఇసుక తరలించే విషయంలో పోటీ వచ్చినట్లు సమాచారం.

✤ దీనిపై తహసీల్దార్‌ను సుశీల దేవిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఇసుక తోలకాన్ని అడ్డుకుంటామని తెలిపారు. ఆర్ఐ, వీఆర్‌వోను పరిశీలించేందుకు పంపినట్లు చెప్పారు.

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

స్పందనకు వందనం

✦ పొన్నవరం వాటరు ట్యాంకు సమీపంలో చెత్త వేస్తుండడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు పంచాయతీ కార్యదర్శి వీరభద్రరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సిబ్బందితో చెత్తను తీయించి బ్లీచింగ్ చల్లించారు.

✦ చట్టన్నవరం ఎస్సీ కాలనీ చర్చి రహదారిలో వీధి దీపం వెలగక రాత్రి ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సిబ్బందితో వీధి దీపాన్ని మార్పించారు.

✦ వి.అన్నవరం పీఏసీఎస్ భవనం సమీపంలో చెత్త నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తోందని గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు.

✦ దాచవరం పంచాయతీ కార్యాలయం సమీపంలో నీటి పైపులైను పగలడంతో తాగు నీరు వృథాగా పోతోందని గ్రామస్థులు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కృష్ణ కిశోర్‌కు ఫిర్యాదుచేశారు. స్పందించిన ఆయన సిబ్బందితో పైపులైనుకు మరమ్మతులు చేయించారు.

– న్యూస్‌టుడే, వీరులపాడు

9 గ్రామాల్లో నష్టపరిహారం అందేలా చర్యలు

కంచికచర్ల, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో ముంపునకు గురైన మండలంలోని కొత్తపేట, గనిఆత్కూరు, చెవిటికల్లు, కునికినపాడు, మున్నలూరు, మోగులూరు, ఎస్.అమరవరం, వేములపల్లి, పెండ్యాల గ్రామాల్లో అధికారులు వెంటనే ఎన్యూమరేషన్ పూర్తి చేసి బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ కేశినేని శివనాథ్ శుక్రవారం అధికారులను ఆదేశించారు. కలెక్టరు సృజన, కంచికచర్ల తహసీల్దారు జాహ్నవి తదితర అధికారులతో మాట్లాడిన ఆయన, ఆ 9 గ్రామాల్లో ఎన్యూమరేషన్ చేయకపోవడంతో బాధితులకు నష్టపరిహారం అందలేదని తెలిపారు. ప్రతి ఒక్క బాధితుడికి నష్టపరిహారం అందాలని ఆయన అధికారులకు సూచించారు. ఎంపీ సూచనల మేరకు అధికారులు ఆయా గ్రామాల్లో ఎన్యూమరేషన్ నిర్వహించనున్నట్లు ఎంపీ కార్యాలయం శుక్రవారం తెలిపింది.

రుణాలు రీషెడ్యూల్ చేయాలి

నందిగామ, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలు, వరదల వల్ల పంటలు దెబ్బతిన్న రైతుల రుణాలు రీషెడ్యూల్ చేయాలని తెదేపా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి యండ్రపల్లి శ్రీనివాసరావు, నాయకుడు పంగా సతీష్ కోరారు. వరద ముంపునకు గురికావడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. వెంటనే సహకార సంఘాలు, వాణిజ్య బ్యాంకుల్లో రైతుల స్వల్పకాలిక రుణాలను రీషెడ్యూల్ చేసి ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 15 రోజుల్లో పెట్టుబడి సాయాన్ని సీఎం అందజేశారని తెలిపారు. వరదల వల్ల పంట భూముల్లో ఇసుక మేటలు తొలగించేందుకు రైతులకు రుణాలు రీషెడ్యూల్ చేయడంతో పాటు ప్రభుత్వం నుంచి సహాయం అందించేలా చూడాలని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరాం తాతయ్యలను కోరారు.

అసంపూర్తి గదులు.. విద్యార్థుల అవస్థలు

కంచికచర్ల, న్యూస్‌టుడే

వైకాపా పాలకుల నిర్లక్ష్య పాలన తాలుకా పాపాలు నేటి విద్యార్థులకు శాపాలుగా మారాయి. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేస్తాం, కార్పొరేటు పాఠశాలలకు దీటుగా వసతులు కల్పిస్తాం అంటూ ఐదేళ్ల ఊకదంపుడు ఉపన్యాసాలు మినహా సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో 'నాడు-నేడు' కింద పలు పాఠశాలల్లో చేపట్టిన అదనపు తరగతి గదులు, వంట గదులు, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో పాఠశాల విద్యార్థులకు వెతలు తప్పడం లేదు.

గదుల నిర్మాణం వివరాలు

మండలం	నిర్మాణం	పూర్తి
చందర్లపాడు	15	0
కంచికచర్ల	18	0
వీరులపాడు	5	0
నందిగామ	11	0

మరుగుదొడ్లు ....

మండలం	మంజూరు	పూర్తి
చందర్లపాడు	27	16
కంచికచర్ల	19	15
వీరులపాడు	16	15
నందిగామ	23	15



కంచికచర్ల మండలం గని ఆత్కూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిలిచిన గదుల నిర్మాణం

సరిపడా లేక..

నాడు-నేడు రెండో విడతలో పలు పాఠశాలల్లో నిర్మాణం చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి కాకపోవడంతో సంఖ్యకు తగినన్ని తరగతి గదులు లేక విద్యార్థులు వరండాల్లో కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. విలీనం జరిగిన చోట్ల ఈ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. కొన్ని బడుల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తయినప్పటికీ వాటికి తలుపులు, కిటికీలు వంటి చిన్న చిన్న పనులు మిగిలిపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి.

తలుపులేవీ?

మరుగు దొడ్ల నిర్మాణం దాదాపుగా పూర్తయినప్పటికీ, ప్రభుత్వం నియమించిన ఏజెన్సీ సకాలంలో తలుపులు ఏర్పాటు చేయకపోవడం. నీటి సదుపాయం కల్పించకపోవండతో అవి ఉపయోగించడానికి వీలు లేకపోయింది. మొదటి విడతలో ఏర్పాటు చేసిన తాగు నీటి ప్లాంట్లు నిర్వహణ లోపంతో మూలకు చేరాయి. దీంతో విద్యార్థులు ఇంటి నుంచే తాగు నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ప్లాంట్లలో దాతల సహకారంతో ఏర్పాటు చేసినవి కూడా ఉన్నాయి.

✤ వైకాపా నిర్లక్ష్య పాలనతో పాఠశాలల్లో చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలిపోవడంతో విద్యార్థులు అవస్థల పాలవుతున్నారని, అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వమైనా విద్యార్థుల కష్టాలు తీరేలా తగు చర్యలు వెంటనే తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

చందర్లపాడు, న్యూస్‌టుడే: వరదలకు, భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలిచిందని తెదేపా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కోట వీరబాబు అన్నారు. చందర్లపాడులోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... అతి తక్కువ సమయంలో పంట నష్టం వివరాలను సేకరించి పరిహారం విడుదల చేశారన్నారు. రైతుల ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే స్పందించిందని తెలిపారు.

నందిగామ ఆర్డీవోగా బాలకృష్ణ

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ ఆర్డీవోగా కె.బాలకృష్ణ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం మంగళగిరిలోని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ అడిషనల్ సీఈవోగా పని చేస్తున్నారు. నందిగామ ఆర్డీవో రవీంద్రరావు బదిలీ అయ్యారు. ఆయనను జీఏడీలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'కార్మికుల తొలగింపు తగదు'

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజనం, పారిశుద్ధ్య కార్మికులు, వాచ్‌మెన్లను అక్రమంగా తొలగించారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ ఆరోపించారు. శుక్రవారం నందిగామ డీవైఈవో కార్యాలయం వద్ద కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ, మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను బలవంతంగా తొలగించారన్నారు. బిల్లులు సకాలంలో రాకపోయినా అప్పుచేసి విద్యార్థులకు భోజనం పెట్టారని తెలిపారు. లింగాలపాడు, ముప్పాళ్ల, సుబ్బాయిగూడెం, అనిగండ్లపాడు, జుజ్జూరు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కార్మికులను రాజకీయ కారణాలతో తొలగించారని ఆరోపించారు. వారందరినీ విధుల్లో కొనసాగించాలని డిమాండు చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.గోపీ నాయక్, మధ్యాహ్న భోజన కార్మికులు వేల్పుల ఏసోబు, కళావతి, సత్యవతి, పుల్లయ్య, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గోపాల్, సీఐటీయూ నాయకులు

ఈవో గంగాధర్ బాధ్యతల స్వీకరణ



నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ రామలింగేశ్వరస్వామి దేవాలయం రెగ్యులర్ ఈవోగా బీమరశెట్టి గంగాధర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక చెన్నకేశవస్వామి దేవాలయానికి, పెద్దవరం గ్రూపు దేవాలయాలకు ఆయన ఇన్‌ఛార్జి ఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఇప్పటి వరకు ఆయన కృష్ణా జిల్లా యనమలకుదురు రామలింగేశ్వరస్వామి దేవాలయ ఈవోగా పనిచేశారు. నందిగామ శివాలయానికి ఈవోగా ఉన్న బి.రవీంద్రను మరో దేవాలయానికి అధికారులు బదిలీ చేశారు.

మురుగు తటాకం కాదు.. శివాలయ కోనేరు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ రామలింగేశ్వరస్వామి దేవాలయం కోనేరు మురుగునీటితో నిండింది. పూర్వం ఈ కోనేరులో స్వామివారి ఉత్సవమూర్తులకు తెప్పోత్సవం నిర్వహించేవారు. పాత బస్టాండులోని ఆర్ఎస్ నెం-521లో 1.25 ఎకరాల విస్తీర్ణంలోని ఈ కోనేరును సుందరీకరణ చేయాలని గతేడాది ఇద్దరు ఈవోలు కృషి చేశారు. రెవెన్యూ, పోలీసుల సహకారంతో కొంత మేర ఆక్రమణలు తొలగించారు. కోనేరుకు నాలుగు వైపులా రాతి గోడలు, తూర్పు వైపు మెట్లు నిర్మించాలని ప్రతిపాదించారు. అది కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం ఈ కోనేరులో వర్షం నీరు, మురుగు నీరు చేరాయి. పక్కనే డ్రెయిన్‌ను అభివృద్ధి చేయించి మురుగు నీటిని ఇంజిన్లతో తోడించాలని భక్తులు కోరుతున్నారు. శివాలయానికి ప్రస్తుతం 400 ఎకరాల మాన్యం ఉంది. వాటిపై వస్తున్న కౌలు ఆదాయంతో అయినా సుందరీకరణ చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



నీటిలో పారువేట మండపం

వేగ నిరోధకాలు ఏర్పాటు చేయండి

నందిగామ, న్యూస్‌టుడే: స్థానిక గాంధీ సెంటర్ నుంచి వెళ్లే ప్రధాన రహదారులపై వాహనాలు అతివేగంగా వెళ్తుండడం వల్ల రాకపోకలు ఇబ్బందిగా ఉందని స్థానికులు వాపోతున్నారు. గాంధీ సెంటర్ నుంచి రథం సెంటర్, చందర్లపాడు రోడ్డు, రామన్నపేట రోడ్లపై వాహనాలు వేగంగా వెళ్తుండడం వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధాన ప్రాంతాల్లో ఆయా రోడ్లపై వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వాహనాలు వేగం తగ్గేలా కనీసం జీబ్రా మార్కులు వేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

డ్రెయిన్లు లేక అవస్థ

నందిగామ, న్యూస్‌టుడే: స్థానిక పాత బైపాస్ రోడ్డులో ఆర్టీవో కార్యాలయం వద్ద డ్రెయిన్లు నిర్మించకపోవడం వల్ల మురుగు నీటితో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయిన్లు నిర్మించకుండా సిమెంట్ రోడ్లు నిర్మించడంతో మురుగునీరు ఖాళీ స్థలాల్లోకి చేరుతోంది. మురుగునీరు నిల్వ ఉండడం వల్ల దుర్వాసన వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు దోమలు ఎక్కువగా ఉండడం వల్ల స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా బయటికి వెళ్లేలా డ్రెయిన్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కలిసికట్టుగా సాగితే.. సమస్యల పరిష్కారం

నందిగామ, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి ఉద్యోగులందరూ కలిసికట్టుగా పని చేయాలని ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ కోరారు. స్థానిక ఎన్జీవోస్ హోమ్‌లో నందిగామ తాలుకా యూనిట్ ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. ఏపీఎన్జీవో సంఘ నందిగామ తాలుకా అధ్యక్షుడిగా ఎస్.కె.బషు, కార్యదర్శిగా ఎం.సాయిరామ్, కోశాధికారిగా ఎం.డి.అబ్దుల్లా షరీఫ్, ఉపాధ్యక్షులుగా కె.నవీన్, సురేష్, సహాయ కార్యదర్శిగా మణిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాయకులతో జిల్లా సంఘ అధ్యక్షుడు విద్యాసాగర్

వరద బాధితులకు సాయం

నందిగామ, న్యూస్‌టుడే: వరద బాధితులకు విశ్రాంత ఉద్యోగులు ఆర్థిక సాయం చేశారు. చెక్కును ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు అందజేశారు. శుక్రవారం స్థానిక కాకానినగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం వీరులపాడు, కంచికచర్ల మండలాల విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సీఎం సహాయనిధికి రూ.11,116 చెక్కును ఎమ్మెల్యేకి అందించారు.

నందిగామ గ్రామీణం: సోమవరంలో శుక్రవారం వరద బాధితులకు నందిగామ క్రీస్తు సంఘం, దూలాస్ ట్రస్టు ఆధ్వర్యంలో 500 కుటుంబాలకు దుస్తులు, నిత్యావసర సరకుల కిట్లు పంపిణీ చేశారు. దూలాస్ ట్రస్టు ఛైర్మన్ పగిడిపల్లి మణి ఆనంద్, కార్యదర్శి దేవ సహాయం వాటిని అందజేశారు. దూలాస్ పాఠశాల, గోల్డెన్ బడ్స్ పాఠశాల, వివేకానంద పాఠశాలల విద్యార్థులు పంపిణీలో సేవ లందించారు.

సబ్ రిజిస్ట్రార్‌గా దుర్గారాణి



నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ సబ్ రిజిస్ట్రార్‌గా దుర్గారాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కైకలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి బదిలీపై ఆమె ఇక్కడికి వచ్చారు. నందిగామలో రెండేళ్లుగా పని చేసిన సబ్‌రిజిస్ట్రార్ విద్యాధరణిని తాడేపల్లిలోని ఐ.జి. కార్యాలయానికి పంపించారు.

కౌలు రైతుకు ఎమ్మెల్యే నివాళి

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ శివారు హనుమంతుపాలెంలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు మేడా వెంకటరవికి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నివాళులర్పించారు. స్థానిక శవాగారంలో మృతదేహాన్ని పరిశీలించి అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. తెదేపా నాయకులు రాటకొండ చంద్రశేఖర్, రాటకొండ గిరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయం.. వరదలతో జఠిలం

షేర్‌మహ్మద్‌పేటను వీడని మురుగు

న్యూస్‌టుడే, జగ్గయ్యపేట

మండలంలోని ప్రధాన మేజర్ పంచాయతీ షేర్‌మహ్మద్‌పేటలో వరదల అనంతరం సమస్యలు మరింత పెరిగాయి. పట్టణ శివారు పాత జాతీయ రహదారిపై ఉన్న ఈ గ్రామంలో మురుగు సమస్య మరింత జఠిలంగా మారింది. పాత జాతీయ రహదారి పూర్తిగా గుంతలతో ప్రమాదకరంగా ఉంది. ఇటుగా వాహనదారులు ప్రయాణం చేయాలంటే భయపడుతున్నారు. జగ్గయ్యపేట అడ్డ రోడ్డు మొదలుకొని తిరిగి జాతీయ రహదారికి అనుసంధానం అయ్యేవరకూ ఉన్న రెండు కిలోమీటర్ల మార్గం మొత్తం ఇదే దుస్థితి నెలకొంది. జగ్గయ్యపేట నుంచి గ్రామానికి వెళ్లే సత్యనారాయణపురం రోడ్డులో ఉన్న అండర్ పాసింగ్ ఏళ్ల తరబడి మురుగుతోనే దర్శనమిస్తోంది. ఇటీవల వర్షాలు, వరదలకు అది మరింత అధ్వానంగా తయారైంది.



ప్రధాన వీధి (పాత జాతీయ రహదారి) దుస్థితి



గ్రామానికి వెళ్లే మార్గంలో అండర్ పాస్ పరిస్థితి ఇదీ...

గ్రామం నుంచి రామచంద్రుని పేట మీదుగా తెలంగాణలోకి వెళ్లే అంతరాష్ట్ర రహదారిలో ఉన్న ఎర్రకాల్వ చప్టా పూర్తిగా కిందికి ఉండడంతో తరచూ నీరు పొంగినప్పుడల్లా ఆ వీధిలో ప్రయాణం దుర్భరంగా మారుతుంది.

పునరావృతం కాకుండా చూడాలి

గడిచిన నెల రోజులుగా పారిశుద్ధ్య పనులు, ప్రత్యేకమైన ప్రజారోగ్య చర్యలు ఏమీ చేపట్టకపోవడం ఆక్షేపణీయంగా ఉంది. రెండు నెలల కిందట జగ్గయ్యపేట నియోజకవర్గంలో డయేరియా ప్రభావితమైన షేర్‌మహ్మద్‌పేటలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో తిరిగి అటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా అధికార యంత్రాంగం తగిన దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యాటక రంగానికి వేదికగా జగ్గయ్యపేట

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పర్యాటక రంగానికి జగ్గయ్యపేటను వేదికగా మార్చడం ద్వారా బహుముఖ ప్రయోజనాలు ఉంటాయని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అన్నారు. పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం బుద్ధ విహార్‌ని సందర్శించిన ఆయన అక్కడ దట్టంగా పెరిగిన తూడు, గుర్రపు డెక్కను తొలగించే పనికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేటలో ఉన్న సహజవనరులు, ప్రాచీన కట్టడాలు, చారిత్రక విశిష్టతను పర్యాటక ప్రాంతంగా మార్చడం ద్వారా భావితరాలకు అవి నిధిగా మారతాయన్నారు. మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తూడు తొలగింపు పని ప్రారంభించిన ఎమ్మెల్యే తాతయ్య

జిల్లా స్థాయి పోటీలకు మాగల్లు జడ్పీ విద్యార్థినులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో మాగల్లు జడ్పీ పాఠశాల బాలికలు జిల్లా స్థాయికి ఎంపికయ్యారని ఫిజికల్ డైరెక్టరు పల్లపు శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. అండర్-14 కబడ్డీలో ఎస్.జ్ఞానేశ్వరి, ఓర్సు అనూష, కె.దేవిశ్రీ, ఎస్.జశ్విత, అండర్-17 కబడ్డీలో ఎ.లాస్యశ్రీ, అండర్-17 షటిల్‌లో మోహిని ఎంపికయ్యారని చెప్పారు.

✦ నందిగామ శ్రీచైతన్య పాఠశాల నుంచి మండల స్థాయి అండర్-17 వాలీబాల్ పోటీల్లో విద్యార్థులు షేక్ రియాజ్, వి.హేమంత్ నాగబ్రహ్మాజీ, కె.రవీంద్ర, లలిత్ అవినాష్ ఈనెల 30 నుంచి జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఆడతారని పీఈటీలు షేక్ యాసిన్, మధు తెలిపారు.



ప్రతిభ చూపిన బాలికలతో పీడీ శ్రీనివాసరావు

సీపీఎం గ్రామ కార్యదర్శిగా గౌస్‌మియా

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: షేర్‌మహమ్మద్‌పేటలో సీపీఎం 2వ గ్రామ శాఖ కార్యదర్శి షేక్ గౌస్‌మియా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలోని కాకర్ల బాలు ఇంటి వద్ద సోమోజు రామనాథం అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. సీపీఎం నాయకులు ఎస్.నాగమణి, కోటా కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

30న విజయవాడలో ధర్నా

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కార్మికుల క్రమబద్ధీకరణ, కనీస వేతనాలు, చట్టాల అమలు కోసం ఈనెల 30న విజయవాడలో జరిగే ధర్నాలో కార్మికులు పాల్గొనాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.సోమేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో విద్యుత్తు, ఆర్టీసీతో సహా పొరుగు సేవల విధానంలో లక్షల మంది పని చేస్తున్నారన్నారు. వారిని క్రమబద్ధీకరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ధర్నాను విజయవంతం చేయాలని ఆటోనగర్‌లో కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. సీఐటీయూ నాయకులు కోట రవి, రావేళ్ల శేషు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు కరపత్రాలు అందిస్తున్న సోమేశ్వరరావు

దుస్తులకు సహజ రంగులు అద్దడంపై శిక్షణ

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రంలో మహిళలకు దుస్తులకు సహజ రంగులు అద్దడం, ఉత్పత్తి చేయడంపై నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. విజయవాడ వ్యవసాయ సాంకేతిక సంస్థ ఆర్థిక సాయంతో నిర్వహిస్తున్నట్లు గృహవిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభావతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ 30 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

సమగ్ర సస్యరక్షణతో మేలైన దిగుబడులు

వత్సవాయి, న్యూస్‌టుడే: పంటల సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా మేలైన దిగుబడులు సాధించవచ్చని విజయవాడ కేంద్రీయ సస్యరక్షణ అధికారి కె.వీరయ్యచౌదరి తెలిపారు. భీమవరంలో పత్తి, మిరప, వరి పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మిత్ర పురుగులను ఎలా గుర్తించాలో రైతులకు ప్రత్యక్షంగా చూపించారు. పత్తిలో రసం పీల్చు పురుగు నివారణకు వేప నూనె పిచికారీ చేయాలని చెప్పారు. గులాబీ రంగు పురుగు ఉద్ధృతి అడ్డుకునేందుకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు. గరికపాడు కేవీకే సమన్వయకర్త కృష్ణంరాజు, శాస్త్రవేత్తలు ప్రేమరంజిత, రాజశేఖర్, శివప్రసాద్, సురేష్ రైతులు పాల్గొన్నారు.



పత్తి పైరు పరిశీలిస్తున్న చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

మొక్కలు నాటిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ కేవీఆర్ కళాశాల విద్యార్థులు శుక్రవారం పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల రోడ్డు వెంట మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ పి.రాయప్ప, ఫిజికల్ డైరెక్టరు వాసిరెడ్డి నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు ఇ.పిచ్చేశ్వరరావు, వై.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ కేవీఆర్ కళాశాలలో భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో 40 మంది ఇంటర్ విద్యార్థులకు పరీక్ష అట్టలు శుక్రవారం పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపల్ పి.రాయప్ప చేతులమీదుగా వాటిని అందజేశారు. సేవాసమితి కన్వీనర్ యు.వాసుదేవరావు, జిల్లా సనాతన సారథి కొత్త సంగమేశ్వరరావు, అధ్యాపకుడు చాట్ల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల-లింగాల ఆర్అండ్‌బీ రహదారిలో ప్రమాదకరంగా కల్వర్టు

ఆదమరిస్తే.. కల్వర్టులోకే..

వత్సవాయి, న్యూస్‌టుడే: మండలంలోని చిట్యాల-లింగాల గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రహదారిపై ఉన్న కల్వర్టు వాహనదారులను వణికిస్తోంది. ఇటీవల వచ్చిన వరదలకు కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురైంది. దానిపై ఉన్న రెయిలింగ్ తక్కువ ఎత్తులో ఉండడంతో ఎదురుగా వాహనం వచ్చినపుడు రోడ్డు ఉందనుకుని పక్కకు జరిగితే కల్వర్టులో పడిపోయే ప్రమాదం ఉంది. రెయిలింగ్‌కు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అండర్‌పాస్‌లో వాహనదారుల అవస్థలు

వత్సవాయి, న్యూస్‌టుడే: మండలంలోని వత్సవాయి- వేమవరం గ్రామాల మధ్య ఉన్న రైల్వే అండర్‌పాస్‌లో నీరు నిలవడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా నీరంతా అండర్‌పాస్‌లో చేరుతోంది. అది బయటకు వెళ్లే అవకాశమున్నా తూములు మూసుకుపోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతోంది. అధికారులు స్పందించి నిలిచిన నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వాణిజ్య సముదాయం నమూనా సిద్ధం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లోని పాత మున్సిపల్ కార్యాలయం స్థలంలో అధునాతనంగా నిర్మించే వాణిజ్య సముదాయం నమూనాపై మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర కౌన్సిలర్లు, నాయకులతో సమీక్షించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో మాజీ మున్సిపల్ ఛైర్మన్ శ్రీరాం సుబ్బారావు సహా పలువురు ముఖ్య నేతలు, కౌన్సిలర్లతో కలిసి ఆయన ఈ నమూనాపై కన్సల్టింగ్ ప్రతినిధులతో చర్చించారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సూచనల మేరకు ప్రముఖ నిర్మాణ సంస్థ ఎస్‌వీఎం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రతినిధుల బృందం భవనం నమూనాలోని వివిధ అంశాలను వివరించారు. త్వరలోనే సీడీపీ అందజేస్తామని ప్రతనిధులు తెలిపారు.

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: మెప్మాలోని స్వశక్తి సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించే మెప్మా అర్బన్ మార్కెట్‌ని మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు శుక్రవారం ప్రారంభించారు. స్థానిక ఐడీఎస్ఎంటీ కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ దుకాణ సముదాయం వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెప్మా సీఎంఎం శ్రీధరరావు, సీవోలు శ్రీదుర్గ, నిర్మల, వెంకట్, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



చీరలు పరిశీలిస్తున్న ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తదితరులు

స్పందనకు వందనం

★ రెండో డివిజన్ కార్మిక నగర్ కొండ పైన అమ్మవారి గుడి సమీపంలో తాగునీటి పైపు పగిలి నిరంతరం వృథాగా పోతోందని స్థానిక నివాసి మూర్తి మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మరమ్మతులు చేయించారు.

★ మూడో డివిజన్ గణేష్ నగర్ కాలనీలో 3-10/187, 188, 189, 191, 202, 228 విద్యుత్ స్తంభాలకున్న దీపాలు వారం రోజులుగా వెలగడం లేదని స్థానిక నివాసి జాస్తి శ్రీనివాస్ మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాలు ఏర్పాటు చేయించారు.

? మహానాడు రోడ్డు, హైటెన్షన్ రోడ్డ వెంబడి లారీలను పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. - మూర్తి

✔ స్పెషల్ డ్రైవ్ పెడతాం -రమేష్, ట్రాఫిక్ సీఐ

- న్యూస్‌టుడే, కరెన్సీనగర్

రైల్వే బ్రిడ్జి ఆనవాళ్లు కాపాడాలని వినతి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా గిద్దలూరు- నంద్యాల రైలు మార్గంలో దిగువమెట్టపల్లి - దొరవారిబావి మధ్య 137 సంవత్సరాల నాటి రైల్వే బ్రిడ్జి ఆనవాళ్లను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, కల్చర్ ఇండియా సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. చరిత్రను కాపాడి భవిష్యత్తు తరాలకు అందించడానికి సీసీవీపీ చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రకాశం జిల్లాలో పర్యటించామన్నారు. ఇటుక రాతి బ్రిడ్జి గోడల్లో రక్షిత కట్టడాలుగా ప్రకటించి, పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ప్రముఖ చిత్రకారుడు జ్యోతి చంద్రమౌళి, పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి ఉన్నారు.

విజయవాడ తూర్పు

పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు

పటమట, న్యూస్‌టుడే: దేశంలో పర్యాటక రంగం రోజురోజుకూ విస్తరిస్తోందని, ఉపాధి అవకాశాలు ఉన్నాయని 4వ ఆంధ్రా గర్ల్స్ బెటాలియన్ మేజర్ స్వాతి పాండే అన్నారు. శుక్రవారం పటమట స్టెల్లా కళాశాలలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పాండే మాట్లాడుతూ.. పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు, నేర్చుకోవాల్సిన నైపుణ్యాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపల్ సిస్టర్ జసింత క్వాడ్రస్, పర్యాటక విభాగాధిపతి ట్యూలా నోయెల్, కెప్టెన్ శైలజ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆక్రమణలు.. రాకపోకలకు అవస్థలు

కృష్ణలంక, న్యూస్‌టుడే

రాణిగారితోట ప్రాంత ప్రజలు సజావుగా రాకపోకలు సాగించడానికి నిర్మించిన విశాలమైన రహదారులు ఆక్రమణలకు గురవుతున్నాయి. రూ.కోట్లు వెచ్చించి నగర పాలక సంస్థ 2014-2019 మధ్య కాలంలో రహదారుల విస్తరణ చేపట్టింది. అవి ఆక్రమణకు గురై.... అనధికార పార్కింగ్‌కు నెలవుగా మారాయి. ఫలితంగా వాహనదారులు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. రాణిగారితోట 18వ డివిజన్ సిమెంటు గోదాము పరిసరాల్లో రహదారులను ఆక్రమించి వాహనాలు నిలుపుతున్నారు. సర్వీసు రోడ్డు వెంబడి బడ్డీలు ఏర్పాటు చేస్తున్నారు.

అసలే ఇరుకు..: రాణిగారితోట సబ్‌వే ద్వారా అధిక శాతం మంది రాకపోకలు సాగిస్తుంటారు. వాస్తవానికి ఇక్కడి ప్రదేశం ఇరుకుగా ఉంటుంది. కృష్ణా పుష్కరాల సందర్భంగా నగర పాలక సంస్థ ప్రధాన రహదారుల విస్తరణతో పాటు సబ్‌వే పరిసరాల్లో రహదారి నిర్మాణం చేపట్టింది. నిర్మాణానంతరం రాకపోకల విషయంలో మరింత వెసులుబాటు లభించాల్సి ఉండగా... ఇరుకుగా మారడం గమనార్హం. సబ్‌వే సమీపంలోని సిమెంటు గోదాము పరిసరాలు ఆక్రమణలు, వాహనాల పార్కింగ్‌తో నిండిపోతున్నాయి. రాణిగారితోట సర్వీసు రహదారికి ఇరువైపులా ఆక్రమణలు వెలిశాయి. భవన నిర్మాణ సామగ్రిని అక్కడ ఉంచి విక్రయిస్తున్నారు. గుడ్ మార్నింగ్ హోటల్ సెంటర్ సమీపంలో రహదారిపై కార్లు, బడ్డీలు పెడుతున్నా.. పట్టణ ప్రణాళిక విభాగం పట్టించుకోవడం లేదని, రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.


రాణిగారితోట సిమెంటు గోదాము పరిసరాల్లో పరిస్థితి ఇదీ


సర్వీసు రోడ్డులో విక్రయానికి ఉంచిన ఇటుకలు, కంకర మూటలు

యువజన సమస్యలపై ఉద్యమిద్దాం

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో యువజన సమస్యలపై ఉద్యమిద్దామని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు అన్నారు. నిరుద్యోగ సమస్య- యువత ముందున్న సవాళ్లు అనే అంశంపై ప్రజాశక్తినగర్‌లోని చండ్ర రాజేశ్వరరావు (గండాలయ్యలో) శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని నరేంద్రమోదీ ఎన్నికల ముందు హామీ ఇచ్చి నిరుద్యోగ యువతను మోసం చేశారని ఆరోపించారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రనాయక్, ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల భార్గవ్, లంకా గోవిందరాజులు, ఉపాధ్యక్షుడు సింగంశెట్టి మోహన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి ప్రజాదరణ

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: విజయవాడ అందాలను మరింత పెంచడానికి స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని ప్రతి డివిజన్‌లోనూ నిర్వహించాలని శాసనసభ్యుడు గద్దె రామ్మోహన్ అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మూడో డివిజన్ కామినేని నగర్‌లో గోడలపై వివిధ రకాల బొమ్మలు వేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు సహాయ సహకారాలతో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో తాను ముందుంటానన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల వ్యవధిలో చేపట్టిన ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పనులు ప్రజాదరణ పొందాయన్నారు. సమస్యలపై స్థానికులతో మాట్లాడారు. విజయవాడ నగరాన్ని స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. కార్పొరేటర్ కొల్లా ప్రసాద్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ బాబూ శ్రీనివాస్ పాల్గొన్నారు.


స్థానికులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె

వ్యాయామంతో ఆరోగ్యం సొంతం

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: ఈనెల 29న మంగళగిరిలోని ఎన్ఆర్ఐ సర్కిల్ వద్ద 'ఏబీ అమరావతి రన్' నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన టీషర్టు, మెడల్స్‌ను శాప్ డిప్యూటీ డైరెక్టర్, ట్రైబల్ స్పోర్ట్స్ అధికారి ఎస్.వి. రమణ, ట్రాఫిక్ సీఐ సూర్య భాస్కరరావు, వీ వైట్ స్పోర్ట్స్ అండ్ ఈవెంట్స్ ఫౌండర్ రాగా వీణ, కోచ్ జి.శ్రీనివాస్, నిర్వాహకుడు ఉదయ్ లబ్బీపేటలోని ఓ హోటల్లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీణ మాట్లాడుతూ... ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరిగా చేయాలని కోరారు. 3, 5, 10 కి.మీ. విభాగాల్లో పరుగు ఉంటుందని చెప్పారు. విజేతలకు రూ.2.40 లక్షల నగదు బహుమతి ఇస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు ఇందిరాగాంధీ మైదానంలో శనివారం సాయంత్రం లోపు తమ పేర్లను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.


టీషర్ట్‌లు ఆవిష్కరిస్తున్న వీణ, సూర్యభాస్కర్, రమణ, శ్రీనివాస్, ఉదయ్ తదితరులు

దేశభక్తి పెంపునకే పోటీల నిర్వహణ

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ బృందగాన పోటీలు శుక్రవారం సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించారు. నగరంలోని పలు జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని గీతాలు ఆలపించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా భారత్ వికాస్ పరిషత్ విజయవాడ బ్రాంచ్ ఛైర్మన్ తేలప్రోలు వీరయ్యగుప్తా మాట్లాడుతూ... విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించడానికి ఈ పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు. పరిషత్ కార్యక్రమాల ఛైర్మన్ ఎంబీఎస్ ప్రసాద్, వైస్ ఛైర్మన్ కిషోర్ కుమార్ జైన్, కోనేరు మధు, పరిషత్ విజయవాడ బ్రాంచి కార్యదర్శి కె.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


పాట పాడుతున్న విద్యార్థినులు

భూగర్భ జలాల కలుషితంతో అనర్థాలు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్(ఐటీపీఐ) సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులుగా 'సంప్రదాయ, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తీర ప్రాంత పరిరక్షణ' పేరుతో నిర్వహించిన సదస్సు శుక్రవారంతో ముగిసింది. సీనియర్ కౌన్సిల్ సభ్యుడు పి.బి.విజయ్‌కుమార్ హాజరై సదస్సు ఆవశ్యతను వివరించారు. వివిధ శాఖల విభాగాధిపతులు తీరప్రాంత మనుగడపై దృష్టి పెట్టాలన్నారు. భూగర్భ జలాల కలుషితంపై చర్యలు తీసుకోకపోతే మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని అన్నారు. కళాశాల డైరెక్టర్ రమేష్ శ్రీకొండ మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక పొడవున తీర ప్రాంతం ఉందని, దాని పరిరక్షణ అందరి బాధ్యతని పేర్కొన్నారు. నానాటికీ తీర ప్రాంతం కోతకు గురవుతోందని, దానిని ఏవిధంగా అధిగమించాలో నిపుణులు మార్గాలు చూపాలన్నారు. ఐటీపీఐ సభ్యులు ప్రదీప్ కుమార్, కార్యదర్శి వి.పి. కులశ్రేష్ఠ పర్యవేక్షించారు.


గోదపత్రిక విడుదల చేస్తున్న విజయ్‌కుమార్, రమేష్ శ్రీకొండ తదితరులు

జాషువాకు నివాళి

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: సమాజంలో కుల వివక్షను జాషువా వ్యతిరేకించారని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో కవికోకిల గుర్రం జాషువా జయంతిని సున్నపు బట్టీల కూడలిలోని పులే, అంబేడ్కర్ భవనంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని మూఢ నమ్మకాలపై పోరాటం చేశారని గుర్తుచేశారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, డాక్టర్ అంకయ్య, న్యాయవాది శ్రీనివాసరావు, ప్రొఫెసర్ లెనిన్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మణరావు తయారు చేసిన విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం స్టడీ మెటీరియల్ ఆవిష్కరించి పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉచితంగా పంపిణీ చేశారు.


స్టడీ మెటీరియల్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

ప్రతిభావంతులకు ఆర్థిక సాయం అభినందనీయం

మాచవరం, న్యూస్‌టుడే: స్థానిక ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గోల్లస్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభా పురస్కారాలను కళాశాల ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా ట్రస్టు నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లో విద్యార్థులు, పేదలకు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా కళాశాల పూర్వ డైరెక్టర్ టి.విజయలక్ష్మి మాట్లాడుతూ పురస్కారాలు అందుకున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ట్రస్టీలు గోళ్ల హనుమాన్‌గుప్తా, విజయశ్రీ గుప్తాలు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి చూపడమే లక్ష్యం

పటమట, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం తప్పుడు విధానాలతో యువతకు ఉపాధి లేకుండా చేసిందని, కూటమి ప్రభుత్వం ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని తెదేపా నాయకుడు గద్దె క్రాంతి కుమార్ అన్నారు. శుక్రవారం అశోక్‌నగర్‌లోని తెదేపా కార్యాలయంలో తెన్నేటి ఉదయ్ అనే యువకుడు రూపొందించిన పైలట్ ట్రైనింగ్ కన్సల్టెన్సీ వెబ్‌సైట్‌ని క్రాంతి కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ... నాయకులు కిలారు శ్రావణ్, పొట్లూరి దర్శిత్, తుమ్మల వెంకట్, ఎం.నితిన్, ఎన్.చిన్న నాగేశ్వరరావు, జి.వెంకట్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. ప్రమాదమే


టిక్కిల్ రోడ్డులో ఫ్యూజ్ బాక్సు పక్కనే నిలిపిన వాహనాలు


సిద్ధార్థ పాఠశాల రహదారి నుంచి కెనరా బ్యాంక్‌కు వెళ్లే రహదారి ప్రారంభంలో ప్రమాదకరంగా

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

నగరంలోని వివిధ ప్రాంతాల్లో నియంత్రికలు, ఫ్యూజ్‌బాక్సులు ప్రమాదకరంగా ఉన్నాయి. రహదారుల పక్కన, కూడళ్లలో తక్కువ ఎత్తులో అవి ఉన్నాయి. ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్న సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో అని ఆందోళన చెందుతున్నారు. వాటిని ఆ శాఖ అధికారులు పరిశీలించి రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

✤ సిద్ధార్థ పబ్లిక్ పాఠశాల రోడ్డు నుంచి కెనరా బ్యాంక్‌కు వెళ్లే రోడ్డు కూడలిలో తక్కువ ఎత్తులో ఉండడంతో ప్రమాదకరంగా ఉందని స్థానికులు చెబుతున్నారు.

✤ కోనేరు లక్ష్మయ్యవీధి చిన్నపాటి వర్షానికే రహదారి మునిగిపోతుంది. పారిశుద్ధ్య సిబ్బంది వచ్చి తొలగించేవరకు నీరు కదలదు. చాలా తక్కువ ఎత్తులో ఫ్యూజ్ పెట్టె ఉండడంతో నీటిలోకి విద్యుత్తు సరఫరా అవుతుందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

✤ మొగల్రాజపురంలో వర్తక, వ్యాపార, వాణిజ్య సంస్థలు ఉన్నాయి. నిత్యం ప్రజలు, వాహనదారులతో రద్దీగా ఉంటుంది. ఇలాంటి ప్రాంతాల్లో ఉన్న ఫ్యూజ్‌బాక్సుల వద్ద వాహనాలు నిలుపుతున్నారు. ఏ మాత్రం తగిలినా ప్రమాదమే. వర్షం కురిసినప్పుడు విద్యుత్తు ప్రసారం అయితే ప్రమాద తీవ్రత ఊహించలేం. ఇలాంటివి జరగకుండా ముందే రక్షణ చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలు అధికారులను కోరుతున్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్రాల ప్రదర్శన

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: దసరా, వివాహాల సందర్భంగా నాణ్యమైన, ఆకర్షణీయమైన రంగుల్లో సరికొత్త వస్త్రాలను ప్రజలకు అందించేందుకు లబ్బీపేటలోని ఎ కన్వెన్షన్‌లో శుక్రవారం నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను స్టాల్స్‌లో ఉంచామని వెల్లడించారు. సిల్క్, కాటన్ చీరలు, బ్లౌజ్‌లు, కుర్తీలు, చీరలు, దుప్పట్లు, సల్వార్ మెటీరియల్, వివిధ డిజైన్ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మహారాష్ట్రకు చెందిన పైథాని సిల్క్, కర్ణాటకకు చెందిన బెంగళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్, కాషిదా సిల్క్, మధ్యప్రదేశ్‌కు చెందిన చందేరి, మహేశ్వరి సిల్క్ తదితర వస్త్రాలు కొలువుదీరినట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు.


చీర చూపిస్తున్న నిర్వాహకులు

లయోలాలో మానూస్- 2కే24

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: వృత్తిపరమైన అనుభవాలే జీవితంలో ఉన్నత స్థితికి చేరడానికి దోహదపడతాయని కుశలవ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.ఆర్.కె.చౌదరి అన్నారు. ఆంధ్రా లయోల కళాశాల బీబీఏ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే 'మానూస్-2కే24' పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు విజయ సూత్రాలను, వ్యాపార మెలకువలను ఆయన వివరించారు. తొలుత కరస్పాండెంట్ సగాయ రాజ్, రెక్టార్ పీఆర్ జాన్ వ్యాపార రంగంలోని అవకాశాలను అందుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. వైస్ ప్రిన్సిపల్ కిరణ్ కుమార్, బీబీఏ విభాగాధిపతి డి.ఉమాకుమారి, మానూస్ కన్వీనర్ డి.శ్రవణ్‌కుమార్ పర్యవేక్షించారు. శనివారం మిస్టర్ అండ్ మిస్ మానూస్, నృత్య పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.


జ్యోతి వెలిగించి పోటీలు ప్రారంభిస్తున్న చౌదరి, సగాయరాజ్ తదితరులు

పవన్ కల్యాణ్ దీక్షకు సంఘీభావం


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జనసేన, తెదేపా నాయకులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు జనసేన, తెదేపా నాయకులు సంఘీభావం తెలియజేశారు. కృష్ణలంక పాత పోలీస్‌స్టేషన్ వీధిలోని కోదండ రామాలయంలో శుక్రవారం సామూహిక లలితా సహస్రనామం, శివ పంచాక్షరి పారాయణం నిర్వహించి అనంతరం ప్లకార్డులతో సంఘీభావం తెలియజేశారు. పీఏసీ సంయుక్త కార్యదర్శి పోతిరెడ్డి అనిత, మేకల విజయలక్ష్మి, మండలి రాజేష్, అమ్మిశెట్టి వాసు, బొప్పన భవకుమార్, ఎన్నమనేని కృష్ణ, గోరిపర్తి నామేశ్వరరావు, కొవ్వూరు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా బందోబస్తు ఏర్పాట్లు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంతమైన వాతావరణంలో అమ్మవారి దర్శనం చేసుకునేలా బందోబస్తు ఏర్పాట్లు ఉండాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు పేర్కొన్నారు. శుక్రవారం సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్స్‌లో దసరా బందోబస్తు నిమిత్తం తెచ్చిన పరికరాలను ఆయన పరిశీలించారు. మైక్ ఎనౌన్స్‌మెంట్ పరికరాలు, లైట్లు, తాళ్లు తదితర వస్తువులను బందోబస్తులో వినియోగిస్తున్నారు. మైక్ పరికరాల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో ప్రజలకు అధికారులు ఎప్పటికప్పుడు తగు సూచనలు అందించేందుకు మైక్ ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. ముఖ్యమైన ప్రదేశాల్లో ఉంచేందుకు డ్రాగన్ లైట్లను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించారు. దసరా సందర్భంగా అన్ని ముఖ్య ప్రదేశాలను కవర్ చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. తద్వారా ఆయా ప్రాంతాల్లో బందోబస్తులో ఉన్న అధికారులకు తగిన సమాచారం అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు గౌతమిశాలి, ఉదయరాణితో పాటు ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.


మైకుల పనితీరును పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

వర్షపు నీరు నిల్వకుండా చర్యలు

ఆటోనగర్, న్యూస్‌టుడే: ఆటోనగర్ రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ఐలా అధికారులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచించారు. శుక్రవారం ఆటోనగర్‌లో పలు రోడ్లపై నిలిచిన వరద నీటిని ఆయన పరిశీలించారు. నీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఐలా అధికారులకు సూచించారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియం, మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానాల్లో శుక్రవారం జరిగిన జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-19 క్రీడా జట్ల ఎంపిక పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సిద్ధార్థ కళాశాల మైదానంలో జరిగిన తైక్వాండో, కరాటే, హాకీ బాలబాలికల జట్ల ఎంపికల్లో 200 మంది తలపడగా... ఐజీఎంసీ స్టేడియంలో జరిగిన బాలబాలికల రగ్బీ, బాలికల కబడ్డీ జట్ల ఎంపికలో సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారని స్కూల్ గేమ్స్ కార్యనిర్వాహక కార్యదర్శి వి.రవికాంత తెలిపారు. జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైన బాలికలు వచ్చే నెల 6 నుంచి మూడు రోజుల పాటు ఎచ్చెర్ల (శ్రీకాకుళం)లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో తలపడారని పేర్కొన్నారు. ఎంపికైన కబడ్డీ క్రీడాకారిణుల వివరాలు ఇవీ...

☛ కె.భవ్యశ్రీ, బి.రమాదేవి (మారిస్ స్టెల్లా కళాశాల, విజయవాడ), బి.కవిత, ఎల్.శరణ్య, కె.జ్యోస్నిక, ఎ.తరుణి, వై.చాందిని సత్య భవానీ, సీహెచ్ రాజేశ్వరి, ఎం.చంద్రిక (ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా కళాశాల, విజయవాడ), కె.ధరణి మౌనిక, బి.రూప (ఏజీ, ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల, ఉయ్యూరు), ఎల్.సుహాసిని (సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, కుంటముక్కల). స్టాండ్ బైస్‌గా ఎ.తులసి, కె.శ్రావణి (ఎస్‌డీఎంఎస్‌ఎం), ఎస్.హేమలత (ఏపీఎస్ డబ్ల్యూఆర్, నిమ్మకూరు), ఎన్.రేచల్ జానీ (ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆకునూరు), డి.మేఘన (ఎస్‌డీఎంఎస్‌ఎం).


రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులతో ఎంపిక కమిటీ

వామపక్షాల ఐక్యతకు బర్దన్ విశేష కృషి

గాంధీనగర్, న్యూస్‌టుడే: వామపక్షాల ఐక్యతకు ఏబీ బర్దన్ విశేష కృషి చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. శుక్రవారం దాసరిభవన్‌లో సీపీఐ పూర్వపు ప్రధాన కార్యదర్శి బర్దన్ శతజయంతి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, అక్కినేని వనజ, ఓబులేసు, జాస్తి కిషోర్‌బాబు, డి.హరనాథ్, ఖాదర్‌బాషా, జానకిరామ్, జె.వి.సత్యనారాయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ పశ్చిమ

బెజవాడ బార్ అసోసియేషన్‌కు వాటర్ కూలర్ బహూకరణ

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: బెజవాడ బార్ అసోసియేషన్‌కు పంజాబ్ నేషనల్ బ్యాంక్ వాటర్ కూలర్‌ను బహూకరించింది. బ్యాంకు డీజీఎం, సర్కిల్ హెడ్ అభిజిత్ సింహ కూలర్‌ను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో బీబీఏ అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి అరిగెల శివరామప్రసాద్, బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్, కంచర్ల రవి, పిల్లా రవి, జె.కె.చక్రవర్తి, సంపర శ్రీనివాస్, బ్యాంకు బ్రాంచి మేనేజర్ లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియం, మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానాల్లో శుక్రవారం జరిగిన జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-19 క్రీడా జట్ల ఎంపిక పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సిద్ధార్థ కళాశాల మైదానంలో జరిగిన తైక్వాండో, కరాటే, హాకీ బాలబాలికల జట్ల ఎంపికల్లో 200 మంది తలపడగా... ఐజీఎంసీ స్టేడియంలో జరిగిన బాలబాలికల రగ్బీ, బాలికల కబడ్డీ జట్ల ఎంపికలో సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారని స్కూల్ గేమ్స్ కార్యనిర్వాహక కార్యదర్శి వి.రవికాంత తెలిపారు. జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైన బాలికలు వచ్చే నెల 6 నుంచి మూడు రోజుల పాటు ఎచ్చెర్ల (శ్రీకాకుళం)లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో తలపడతారని పేర్కొన్నారు. ఎంపికైన కబడ్డీ క్రీడాకారిణుల వివరాలు ఇవీ...

● కె.భవ్యశ్రీ, బి.రమాదేవి (మారిస్ స్టెల్లా కళాశాల, విజయవాడ), బి.కవిత, ఎల్.శరణ్య, కె.జ్యోస్నిక, ఎ.తరుణి, వై.చాందిని సత్య భవాని, సీహెచ్ రాజేశ్వరి, ఎం.చంద్రిక (ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా కళాశాల, విజయవాడ), కె.ధరణి మౌనిక, బి.రూప (ఏజీ, ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల, ఉయ్యూరు), ఎల్.సుహాసిని (సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, కుంట ముక్కల), ఎస్.ఇంద్రజ (ఎస్‌డీఎంఎస్ఎం), ఎస్.హేమలత (ఏపీఎస్‌డబ్ల్యూఆర్, నిమ్మకూరు), ఎన్.రేచల్ జానీ (ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆకునూరు), డి.మేఘన (ఎస్‌డీఎంఎస్ఎం).

అతిథి టూర్స్ అండ్ ట్రావెల్స్‌కు అవార్డు



ట్రావెల్స్ ఎండీ చిట్టూరి భార్గవికి అవార్డును అందజేస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు రామ్మోహనరావు, వసంత తదితరులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పర్యాటక రంగంలో విశిష్ట సేవలు అందించిన అతిథి టూర్స్ అండ్ ట్రావెల్స్‌కు బెస్ట్ ఎమర్జింగ్ ట్రావెల్ కంపెనీ ప్రమోటింగ్ ఆంధ్రప్రదేశ్ అవార్డును రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం అందజేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో అవార్డును స్వీకరించడం ఆనందంగా ఉన్నదని అతిథి టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ చిట్టూరి భార్గవి అన్నారు. వరుసగా రెండో సారి అవార్డు రావడంలో కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రం పర్యాటక రంగంలో దేశంలో ప్రథమ స్థానంలో నిలిచేందుకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహనరావు, వసంత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

జగన్మాత ఉత్సవం.. జగమంతా సంబరం..

ప్రసాదాల పోటుకు మరమ్మతులు

దసరాకు చకచకా ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే దసరా ఉత్సవాలకు దుర్గ గుడి ముస్తాబవుతోంది. వారం రోజుల వ్యవధిలో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రధాన ఆలయంతో పాటు రాజగోపుర ప్రాంగణానికి రంగులు వేస్తున్నారు. గత ఏడాది ప్రసాదాల పోటులో 15 లక్షల లడ్డూ ప్రసాదాలు తయారు చేశారు. ఈసారి 20 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేస్తున్నారు. అందుకు అనుగుణంగా ప్రసాదాల పోటుకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు ప్రారంభించారు. తిరుమలలో లడ్డూ ప్రసాదం అపవిత్రత వెలుగు చూసిన తరువాత దేవాదాయ శాఖ అప్రమత్తం అయ్యింది. లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యి, జీడిపప్పు, శెనగపప్పు, యాలకులు, కిస్మిస్ తదితర వాటి నాణ్యతపై నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని నిర్ణయించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రసాదాల పోటు నుంచి నమూనాలను సేకరించారు. నాణ్యత లేని పదార్థాలను తిప్పి పంపించారు.



ప్రసాదాలు సిద్ధం చేస్తున్న మహిళలు



రాజగోపుర ప్రాంగణానికి రంగులు వేస్తున్న సిబ్బంది

ఎల్ఈడీ వెలుగులు

దుర్గగుడి ఘాట్ రోడ్డు మార్గంలో పొంగళ్ల షెడ్డుపైన ఏర్పాటు చేసిన ఓంకారానికి ప్రత్యేకత ఉంది. రైళ్లు, బస్సుల్లో వచ్చే భక్తులతో పాటు నిత్యం పాతబస్తీకి వచ్చే వారు రాత్రి వేళల్లో ఓంకారం ప్రత్యేకంగా కనిపిస్తుంది. దసరా ఉత్సవాల నాటికి ఎల్ఈడీ కాంతులు వెదజల్లే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఘాట్ రోడ్డు మార్గంలో ఇటీవల జారిపడిన కొండరాళ్ల కారణంగా ధ్వంసమైన జోనల్ సెల్ యొద్ద ప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. గతంలో మెష్‌ను సైతం దీటుకొని కొండరాళ్లు సమాచార కేంద్రంపైన పడ్డాయి. దీంతో సమాచార కేంద్రాన్ని ఈసారి క్యూ లైన్లకు సమీపంలో ఉండే విధంగా ఏర్పాటు చేయాలని దేవస్థానం అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.



ఓంకారానికి విద్యుద్దీపాల పనుల్లో కార్మికులు

మల్లేశ్వరాలయం సమీపంలో ఫుట్ బ్రిడ్జి

దసరా ఉత్సవాల్లో కీలకమైన మల్లేశ్వరాలయ మెట్ల మార్గం అభివృద్ధి పనుల నిమిత్తం కొంత మేర మూసి వేయాల్సి రావడంతో యుద్ధ ప్రాతిపదికన ఫుట్ బ్రిడ్జి ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. గత ఏడాది దసరా ఉత్సవాల ముందు కొండరాళ్లు జారిపడటంతో రూ.52 లక్షల వ్యయంతో ఫుట్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. దుర్గ గుడి ఘాట్ రోడ్డు మార్గంలో దర్శనానికి వచ్చిన భక్తులు అమ్మవారి దర్శనం అనంతరం మల్లేశ్వరాలయం మెట్ల మార్గంతో పాటు మహా మండపంలోని ర్యాంపు మార్గాన్ని వినియోగించనున్నారు.

డీసీటీఎంగా నియామకం



డీసీటీఎంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావుకు అభినందనలు తెలుపుతున్న ఆర్టీసీ కార్మిక పరిషత్ నాయకులు

విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే: పండిట్ నెహ్రూ బస్టాండ్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (డీసీటీఎం)గా శుక్రవారం సర్రా శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. ఇటీవల డీసీటీఎంగా బషీర్ అహ్మద్ విధులు నిర్వహించారు. ఆయన పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్మిక పరిషత్ నాయకులు నూతన డీసీటీఎంను బస్టాండ్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో కార్మిక పరిషత్ నాయకులు రీజనల్ కార్యదర్శి వై.రమేష్, కంపాల నారాయణ, కెనడీ, కోసూరి సురేంద్ర పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

భవానీపురం, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా భవానీపురం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం రెండు గంటల పాటు సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌బీకాలనీ, బైపాస్ రోడ్డు, రిలయన్స్ ఫ్రెష్, తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వామపక్షాల ఐక్యతకు బర్దన్ విశేష కృషి



బర్దన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామకృష్ణ, విల్సన్, వనజ, నాగేశ్వరరావు తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: వామపక్షాల ఐక్యతకు ఏబీ బర్ధన్ విశేష కృషి చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. శుక్రవారం దాసరిభవన్‌లో సీపీఐ పూర్వపు ప్రధాన కార్యదర్శి బర్ధన్ శతజయంతి సభ నిర్వహించారు. ఈ సభలో రామకృష్ణ మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో బర్ధన్ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. చివరి వరకు సిద్ధాంతానికి కట్టుబడి పనిచేశారని, తన యావదాస్తిని పార్టీకి దానం చేశారని గుర్తు చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ భాజపాకు వ్యతిరేకంగా లౌకికశక్తుల ఐక్యత కోసం బర్ధన్ ముఖ్యపాత్ర పోషించారన్నారు. తమ ఉనికికే ప్రమాదం వస్తుందనే భయంతో తెదేపా, జనసేన పార్టీలు భాజపాతో అంటకాగుతున్నాయని విమర్శించారు. లడ్డూ వివాదాన్ని అడ్డం పెట్టుకొని రాష్ట్రంలో మత ఘర్షణలు సృష్టించేందుకు భాజపా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తితిదేను కేంద్రం తన ఆధీనంలోకి తీసుకోవాలని కుట్ర చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, అక్కినేని వనజ, ఓబులేసు, జాస్తి కిషోర్‌బాబు, డి.హరనాథ్, ఖాదర్‌బాషా, జానకిరామ్, జె.వి.సత్యనారాయణమూర్తి, చంద్రానాయక్, కాశియ్య, నజీర్, జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



చీర చూపిస్తున్న నిర్వాహకులు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : దసరా, వివాహాల సందర్భంగా నాణ్యమైన, ఆకర్షణీయమైన రంగుల్లో సరికొత్త వస్త్రాలను ప్రజలకు అందించేందుకు లబ్బీపేటలోని ఎ కన్వెన్షన్‌లో శుక్రవారం నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను స్టాల్స్‌లో ఉంచామని వెల్లడించారు. సిల్క్, కాటన్ చీరలు, బ్లౌజ్‌లు, కుర్తీలు, చీరలు, దుప్పట్లు, సల్వార్ మెటీరియల్, వివిధ డిజైన్ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మహారాష్ట్రకు చెందిన పైథాని సిల్క్, కర్ణాటకకు చెందిన బెంగళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్, కాషిదా సిల్క్, మధ్యప్రదేశ్‌కు చెందిన చందేరి, మహేశ్వరి సిల్క్ తదితర వస్త్రాలు కొలువుదీరినట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

వంద రోజుల పాలనలో ప్రజలు హర్షం



తెదేపా కార్యాలయంలో బేగ్‌తో రమణ, ఇతర నాయకులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షోభంలోను ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్ అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 100 రోజులు పాలన సందర్భంగా 48వ డివిజన్ తెదేపా అధ్యక్షుడు పేరాబత్తుల రమణ ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 100 రోజుల్లో ప్రజలు సంతోషంగా ఉండే విధంగా పాలన ఉందన్నారు. వరద విపత్తులో తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలకు అండగా చంద్రబాబు నిలిచారని, వారి కష్టాలనుపంచుకుని నష్ట పరిహారాన్ని అందించారని అన్నారు. అనంతరం చిట్టినగర్‌లోని తెదేపా కార్యాలయంలో బేగ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఉప్పాడి రాము, వెంకన్న, సోమేశ్, అప్పారావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భవానీపురం: 8008574638

స్పందనకు వందనం

★ భవానీపురం పరిధిలో కరకట్టను తవ్వి అక్రమ నిర్మాణం చేపడుతున్నారంటూ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులకు తెలపగా స్పందించి ఆ నిర్మాణాన్ని అడ్డుకున్నారు.

★ హెచ్‌బీ కాలనీలో ఉద్యానవనం అపరిశుభ్రంగా ఉందని నగరపాలక సంస్థ అధికారులకు తెలియజేయగా స్పందించి శుభ్రపరిచారు.

★ విద్యాధరపురం లేబర్‌కాలనీ ప్రాంతంలో చెత్త పేరుకుపోయి ఉందని పారిశుద్ధ్య విభాగం సిబ్బందికి తెలపగా స్పందించారు. చెత్తను తొలగించి రహదారిని శుభ్రం చేశారు.

★ చిట్టినగర్ కొండ ప్రాంతంలో తాగునీటి పైపులైనుకు లీకేజీ ఏర్పడిందని నీటి సరఫరా విభాగం అధికారుల దృష్టికి తీసుకు వెళ్లగా మరమ్మతులు చేపట్టారు. దీంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, భవానీపురం

భోజనం ప్యాకెట్ల పంపిణీ

భవానీపురం, న్యూస్‌టుడే: వరద కారణంగా ముంపునకు గురైన వైఎస్ఆర్ కాలనీ వాసులకు నోవా హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ నిర్వాహకులు సలోమీ ప్రసాద్ భోజనం ప్యాకెట్లను శుక్రవారం అందజేశారు. కాలనీలో పర్యటించి బాధితులకు వారికి ధైర్యం చెప్పారు.

చిన్నారులు.. ఈతలో మేటి

ప్రతిభ చాటుతూ.. పతకాలు సాధిస్తూ..

చిట్టినగర్, న్యూస్‌టుడే

నీటిలోకి దిగి చేప పిల్లలతో పోటీ పడతారు. సీతాకోకచిలుక రెక్కలు ఊగినట్లు ఊగుతూ ఈదుతున్న తీరు చూపరులను కట్టి పడేస్తాయి. వెలికిలా పడుకొని కదలనట్లుగానే కనిపిస్తారు. ఇట్టే గమ్యాన్ని చేరుతారు. పోటీల్లో దిగితే చాలు పతకాల పంట పండిస్తున్నారు. కేఎల్‌రావు నగర్ స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు సాధిస్తున్న విజయాలు ఎందరికో స్ఫూర్తినిస్తున్నాయి...

ఏడేళ్లుగా శిక్షణ



మేము భవానీపురంలో నివాసం ఉంటున్నాం. ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కోసం అమ్మానాన్న ఈత శిక్షణలో చేర్పించారు. 7 ఏడేళ్లుగా శిక్షణ పొందుతున్నా. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పాల్గొన్ని పతకాలను సొంతం చేసుకున్నా. 6 సార్లు సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొన్నాను. బంగారం 9, రజతం 16, కాంస్యం 18 పతకాలు సాధించాను. 1.5 కిలో మీటర్ల దూరం ఉన్న కృష్ణా నదిని 3 సార్లు క్రాస్ చేశాను. **- కొయ్య హర్ష మేఘన, భవానీపురం**

జాతీయ స్థాయిలో రాణిస్తా..



మేము చిట్టినగర్ సమీపంలోని సిండికేటు బ్యాంకు కాలనీలో నివాసం ఉంటున్నాం. బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నా. ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా ఈత పట్ల ఆసక్తి ఉండడంతో 5 ఏళ్ల కిందట శిక్షణ తీసుకున్నా. 2022-23 ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రజతం, అదే ఏడాదిలో తిరుపతిలో బంగారం, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నా. 2023-24లో రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు, రజత పతకాలు సాధించాను. 2023లో దిల్లీలో జాతీయ స్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించా. జాతీయ స్థాయిలో రాణించాలనేది నా లక్ష్యం.

- పి.గిరీష్, సిండికేటు బ్యాంకు కాలనీ

ఒలింపిక్సే లక్ష్యం



మేము కేఎల్‌రావునగర్‌లో ఉంటాం. డిగ్రీ రెండో ఏడాది చదువుతున్నా. పుట్టుకతోనే చెవిటి, మూగ. నా లోపాన్ని అధిగమించి ముందుకు సాగాలనే సంకల్పంతో 10 ఏళ్లుగా శిక్షణ పొందుతున్నా. నాకు మెలకువలు నేర్పించాలని శిక్షకుడు రఫీతో సైగలు చేసి చెప్పేదాన్ని. ఆయన అర్థం చేసుకుని నాకు సైగలతోనే ఈతలో మెలకువలు చెప్పేవారు. రాష్ట్ర స్థాయిలో డెఫ్ అండ్ డమ్ కేటగిరిలో పలు విభాగాల్లో ప్రతిభ చూపాను. రాష్ట్రస్థాయిలో బంగారు -11, రజతం-18, కాంస్యం-9 సొంతం చేసుకున్నాను. జాతీయ స్థాయిలో బంగారు పతకం-1, రజతం-7, కాంస్యం-1 సాధించాను. ఒలింపిక్స్‌లో పాల్గొని రాణించాలనేది లక్ష్యం.

- డి.మానస, కేఎల్‌రావు నగర్

మరింత కృషి చేస్తా..



మేము లంబాడీపేటలో నివాసం ఉంటున్నాం. 8వ తరగతి చదువుతున్నా. చదువుతో పాటు ఏదో ఒక క్రీడలో ప్రావీణ్యత అవసరమని అమ్మానాన్న ఈతలో శిక్షణ పొందేందుకు 3 ఏళ్ల కిందట చేర్పించారు. జిల్లా, నగర స్థాయి పోటీల్లో పలుమార్లు పాల్గొని సత్తా చాటడంతో రాష్ట్ర స్థాయిలో 3 సార్లు పాల్గొని రెండు సార్లు కాంస్య పతకాలు సాధించాను. జాతీయ స్థాయిలో 3 సార్లు పాల్గొనే అవకాశం దక్కింది. భవిష్యత్తులో మరింత రాణిస్తా.

- స్మృతి హర్షిక, లంబాడీపేట

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

విద్యాధరపురం, న్యూస్‌టుడే: కబేళా సెంటర్ సమీపంలోని బృందావన్ కాలనీలో రూ.19.70 లక్షలతో కార్పొరేషన్ చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు 45వ డివిజన్ తెదేపా అధ్యక్షుడు మైలవరపు కృష్ణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే సుజనాచౌదరి సహకారంతో సీసీ రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారన్నారు. కార్పొరేటరు మాధురి లావణ్య స్థానికుల సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకు వచ్చారన్నారు. నాయకులు వెంకటయ్య, శివ, అబ్రహం, బుచ్చిబాబు పాల్గొన్నారు.

వ్యాపారంలో రాణించాలంటే నైపుణ్యాలు అవసరం



మాట్లాడుతున్న ఎఫెక్స్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరేంద్రకుమార్

చిట్టినగర్, న్యూస్‌టుడే: విద్యార్థులు వ్యాపార రంగంలో రాణించాలంటే అందుకు అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవాలని ఎఫెక్స్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.నరేంద్రకుమార్ అన్నారు. కొత్తపేట కేబీఎన్ సీజీ కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో 'మీట్ ది సీఈవో' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటుగా ఎంచుకున్న రంగాలకు సంబంధించి నైపుణ్యాలను సైతం ఉండాలన్నారు. వ్యాపార, వాణిజ్య రంగాల్లో రాణించాలంటే సహనం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్.రమేష్, పీజీ డైరెక్టర్ ఎస్.వెంకటేష్, విభాగాధిపతి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగంపై అవగాహన



జోసియల్ లిమిటెడ్‌ను సందర్శించిన విద్యార్థులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: విద్యార్థులు పారిశ్రామిక రంగంపై అవగాహన పెంచుకుని పట్టు సాధించేందుకు కృషి చేయాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ పతంజలి శాస్త్రి అన్నారు. ఆ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా గుంటూరు జిల్లా డోకిపర్రులోని జోసియల్ లిమిటెడ్‌ను సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ఆయా రంగంలో వస్తువుల ఉత్పత్తికి అవసరమయ్యే కోర్సులకు అనుబంధంగా ఉండే అంశాలను తెలుసుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డి.డి.వి.ప్రసాద్, అధ్యాపకులు వంశీకృష్ణ, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ బాధితుల ఆందోళన



సచివాలయం వద్ద గుంపులుగా ప్రజలు

భవానీపురం: వరద కారణంగా నష్టపోయామని, ఆదుకోవాలంటూ బాధితులు భవానీపురం కరకట్ట ప్రాంతంలోని సచివాలయం వద్దకు శుక్రవారం మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కృష్ణానది, బుడమేరు వరద నీరు తమ నివాసాల్లోకి వచ్చి సామగ్రి అంతా ధ్వంసమైనట్లు పేర్కొన్నారు. తమకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదని వాపోయారు. న్యాయం చేయాలని సచివాలయంలో ఉన్న అధికారులను కోరారు. ప్రభుత్వం ఇచ్చే నష్ట పరిహారాన్ని తమకు వర్తింపజేయాలన్నారు.

నష్ట పరిహారం అందించాలి

విద్యాధరపురం: గట్టు వెనక ప్రాంతంలోని 38వ డివిజన్‌లో కృష్ణానదికి వచ్చిన వరద నీరు ఇళ్లల్లోకి వచ్చిన ప్రతి ఒక్కరికీ వరద సహాయం అందించాలని కార్పొరేటరు రహంతున్నీసా ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది కార్పొరేటరు వరద బాధితుల గురించి పట్టించుకోలేదని ప్రచారం చేయడం తగదన్నారు.

బ్యాంకు అధికారులకు భాషపై పట్టు ఉండాలి

విద్యాధరపురం, న్యూస్‌టుడే: బ్యాంకులో పని చేసే అధికారులకు ప్రాంతీయ భాషపై పట్టు ఉండాలని ముంబై అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వివేకానంద్ అన్నారు. పాతబస్తీలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ కార్యాలయంలో ఇందీ ప్రచార సభ (హైదరాబాద్) శుక్రవారం నిర్వహించిన తెలుగు శిక్షణ కార్యక్రమంలో ముంబై అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వివేకానంద్ మాట్లాడుతూ.. ప్రాంతీయ భాషపై అవగాహన ఉన్నప్పుడు మాత్రమే అధికారులు విధుల్లో రాణిస్తారన్నారు. హిందీ ప్రచార సభ ప్రతినిధులు చంద్రదేవ్ కవ్‌డే, పరీక్షా సంచాలకులు సురేష్ పూరి, అధ్యాపకులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. గతంలో అధిక సంఖ్యలో హిందీతో పాటు ప్రాంతీయ భాషలను నేర్పించామన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ విజయవాడ జోనల్ కార్యాలయం అధికారి భాస్కరరావు, ప్రతినిధులు వివేక్ సుధ, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా బందోబస్తు ఏర్పాట్లు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంతమైన వాతావరణంలో అమ్మవారి దర్శనం చేసుకునేలా బందోబస్తు ఏర్పాట్లు ఉండాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. శుక్రవారం సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్స్‌లో దసరా బందోబస్తు నిమిత్తం తెచ్చిన పరికరాలను ఆయన పరిశీలించారు. మైక్ ఎనౌన్స్‌మెంట్ పరికరాలు, లైట్లు, తాళ్లు తదితర వస్తువులను బందోబస్తులో వినియోగిస్తున్నారు. మైక్ పరికరాల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో ప్రజలకు అధికారులు ఎప్పటికప్పుడు తగు సూచనలు అందించేందుకు మైక్ ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. ముఖ్యమైన ప్రదేశాల్లో ఉంచేందుకు డ్రాగన్ లైట్లను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించారు. దసరా సందర్భంగా అన్ని ముఖ్య ప్రదేశాలను కవర్ చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. తద్వారా ఆయా ప్రాంతాల్లో బందోబస్తులో ఉన్న అధికారులకు తగిన సమాచారం అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు గౌతమిశాలి, ఉదయరాణితో పాటు ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదురు దుకాణంలో చోరీ

చిట్టినగర్, న్యూస్‌టుడే: కొత్తపేట పోలీస్‌స్టేషన్ కి ఎదురుగా అతి సమీపంలో ఉన్న ఓ దుకాణంలో చోరీ జరిగింది. సేకరించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంజనేయ వాగు ప్రాంతానికి చెందిన బెవర దుర్గారావు పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో భవానీ మెటల్ అండ్ జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నారు. ఈనెల 25వ తేదీన అతడు వేరే వ్యక్తికి ఇవ్వాల్సిన నగదు, సుమారు రూ. లక్ష, సేల్స్ దుకాణంలోని కౌంటర్‌లో పెట్టి యథావిధిగా షాపునకు తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోయారు. 26వ తేదీన వచ్చి దుకాణం తెరిస్తే వెనుక భాగంలో తలుపు గడియ తీసి ఉంది. అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా.. కౌంటర్‌లో పెట్టిన నగదు, ఇత్తడి వస్తువులు, ఇతర సామగ్రి చోరీకి గురైనట్లు గుర్తించారు. సీసీ కెమెరా పరిశీలించగా.. సుమారు రాత్రి 2 గంటల సమయంలో షాపు పక్క వీధిలో నుంచి గుర్తు తెలియని వ్యక్తి దుకాణంలోకి చొరబడి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఈమేరకు శుక్రవారం బాధితుడు దుర్గారావు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ విషయమై కొత్తపేట సీఐ చిన కొండలరావును వివరణ కోరగా.. కేసు నమోదు చేయలేదని, తను సీఎం కార్యక్రమంలో ఉన్నానని బాధ్యతా రాహిత్యంగా చెప్పడం గమనార్హం.

120 బస్తాల చౌక బియ్యం పట్టివేత

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే: 120 బస్తాల చౌకబియ్యాన్ని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. శాంతినగర్ నుంచి రెండు మినీ వ్యానుల్లో చౌకబియ్యం గుంటూరుకు వెళుతున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్, నున్న పోలీసులు దాడులు చేసిన రెండు వాహనాలను పట్టుకున్నారు. వాటిలో 120 బస్తాల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. వ్యాను డ్రైవర్లు వినోద్, తన్వీర్‌లను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో విద్యాధరపురం నాలుగు స్తంభాల కూడలికి చెందిన సువ్వాడ గోపికి చెందిన బియ్యంగా పోలీసులు గుర్తించారు. నున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ల్యాప్‌టాప్‌ల దొంగ అరెస్ట్



నిందితుడిని చూపుతున్న రైల్వే పోలీసులు

రైల్వేస్టేషన్: రైళ్లలో ప్రయాణికుల ల్యాప్‌టాప్ చోరీ చేసిన కేసులో నిందితుడిని శుక్రవారం రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన తండుగు రామకృష్ణ (27) ఇటీవల ప్రయాణికుల వద్ద రెండు ల్యాప్‌టాప్‌లు చోరీ చేశారు. దీనిపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో విజయవాడ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. అనుమానం వచ్చి రైల్వే పోలీసులు అతని బ్యాగులు తనిఖీ చేయగా.. రూ.1.70 లక్షల విలువ చేసే రెండు ల్యాప్‌టాప్‌లు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి రైల్వే కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండు విధించారు. విజయవాడ రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్ పర్యవేక్షణలో డీఎస్పీ రత్నరాజు ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సీఐలు జె.వి.రమణ, ఫతేఅలీ, సిబ్బంది కేసును ఛేదించారు.

విజయవాడ మధ్య

గ్యాస్ పొయ్యిలు, కుక్కర్ల పంపిణీ



మహిళకు గ్యాస్ పొయ్యి అందిస్తున్న బొండా ఉమామహేశ్వరరావు, చిత్రంలో కొమ్మారెడ్డి పట్టాభిరామ్, నాగుల్‌మీరా, పరుచూరి ప్రసాద్

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే: కండ్రిక సాయిబాబా గుడి సమీపంలోని లగడపాటి కల్యాణమండపంలో తెదేపా జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆధ్వర్యంలో శుక్రవారం 2 వేల మంది 64వ డివిజన్ వాసులకు గ్యాస్ పొయ్యిలు, కుక్కర్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమం అందించడంలో, వరద సమయంలో సహాయక చర్యలు చేపట్టడంలో కూటమి ప్రభుత్వం బాగా పనిచేసిందన్నారు.

64వ డివిజన్ దత్తత.. వరదల్లో తీవ్రంగా నష్టపోయిన 64వ డివిజన్ కండ్రికను తెదేపా జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ దత్తత తీసుకున్నారు. ఇప్పటికే 2500 మందికి దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. తాజాగా తన స్నేహితులైన నాల్‌సాఫ్ట్ ఛైర్మన్ నల్లూరి శేషయ్య, మైటీ కాంట్రాక్టింగ్ ఛైర్మన్ నరేష్, తెదేపా ఆస్ట్రేలియా ప్రతినిధులు విజయ్, వెంకట్, రవిల సహకారంతో 2వేల మంది వరద బాధితులకు గ్యాస్ స్టౌవ్‌లు, కుక్కర్లు బహూకరించారు. కండ్రికలోని బి.వి.సుబ్బారెడ్డి నగరపాలకసంస్థ పాఠశాలను దత్తత తీసుకుని దానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, నాయకులు షేక్ నాగుల్‌మీరా, పరుచూరి ప్రసాద్, మల్లికార్జునయాదవ్, పరసా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తోట సుధాకర్‌ప్రసాద్‌కు నివాళి



గవర్నర్‌పేట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల శ్రేయస్సు కోసం తోట సుధాకర్ ప్రసాద్ నిరంతర పోరాటం చేశారని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం రెవెన్యూభవన్‌లో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తోట సుధాకర్ ప్రసాద్ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా సుధాకర్ ప్రసాద్ విగ్రహానికి ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర, జిల్లా నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్.వి.వి.రోహిణిదేవి, పి.జాహ్నవి, ఎన్.శ్రీనివాసమూర్తి, బత్తిన రామకృష్ణ, డి.శ్రీనివాస్, ఎస్వీ రవీంద్ర, ఎస్వీ రాజేశ్వరి, పలిశెట్టి దామోదరరావు పాల్గొన్నారు.

జాగ్రత్త.. చూసి వెళ్లండి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే వ్యాపార కేంద్రం గవర్నర్‌పేటలో కల్వర్టులపై వేసిన దిమ్మెలు శిథిలమై వాహన చోదకులను భయపెడుతున్నాయి. ఏ క్షణంలో ఏమి జరుగుతుందో అనుకుంటూ ప్రజలు గుండెలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ప్రధాన రహదారులైన గోపాలరెడ్డిరోడ్డు, రాజగోపాలాచారి వీధుల్లోనే ఈ పరిస్థితులు ఉండడం, అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆదమరిస్తే చాలా ప్రమాదం

గోపాలరెడ్డిరోడ్డులో మహంతి చేపల మార్కెట్ వెనుక వీధి వద్ద కల్వర్టుపై వేసిన ఇనుప కమ్మీలు విరిగిపోయి పైకి లేచిపోయాయి. రాత్రి వేళ కనబడక ఏ మాత్రం అజాగ్రత్తగా వచ్చి దీనిని ఢీకొడితే కింద పడిపోవడం ఖాయం. చీకటిలో కాళ్లకు ఈ ఇనుప కమ్మీలు తగిలితే పెను ప్రమాదం జరుగుతుంది. రోజూ వేలాది మంది ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు వెళ్లే ఈ మార్గంలో ప్రమాదకరంగా ఉన్న ఇనుప కమ్మీల గురించి పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.





కుంగిన కల్వర్టు దిమ్మె..

రాజగోపాలచారివీధిలో బకింగ్‌హాంపేట పోస్టాఫీస్ ఎదురుగా కల్వర్టుపై వేసిన సిమెంటు దిమ్మె విరిగిపోయింది. ఇక్కడ ఉన్న రెండు దిమ్మెల్లో ఒకటి సగానికి విరిగిపోయింది. ఈ మార్గంలో రాత్రి వేళ సరకుతో ఉన్న లారీలు వస్తుంటాయి. ఏ వాహనమైనా విరిగిన దిమ్మెపైకి ఎక్కితే కుంగిపోయి పడిపోతుంది. ప్రమాదాలు జరగక ముందే విరిగిన కల్వర్టు దిమ్మెను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా బందోబస్తు ఏర్పాట్లు



మైక్‌ల పనితీరు పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడ నేరవార్తలు : భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంతమైన వాతావరణంలో అమ్మవారి దర్శనం చేసుకునేలా బందోబస్తు ఏర్పాట్లు ఉండాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. శుక్రవారం సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్స్‌లో దసరా బందోబస్తు నిమిత్తం తెచ్చిన పరికరాలను ఆయన పరిశీలించారు. మైక్ ఎనౌన్స్‌మెంట్ పరికరాలు, లైట్లు, తాళ్లు తదితర వస్తువులను బందోబస్తులో వినియోగిస్తున్నారు. మైక్ పరికరాల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో ప్రజలకు అధికారులు ఎప్పటికప్పుడు తగు సూచనలు అందించేందుకు మైక్ ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. ముఖ్యమైన ప్రదేశాల్లో ఉంచేందుకు డ్రాగన్ లైట్లను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించారు. దసరా సందర్భంగా అన్ని ముఖ్య ప్రదేశాలను కవర్ చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. తద్వారా ఆయా ప్రాంతాల్లో బందోబస్తులో ఉన్న అధికారులకు తగిన సమాచారం అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు గౌతమిశాలి, ఉదయరాణితో పాటు ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.

బ్యాంకు అధికారులకు భాషపై పట్టు ఉండాలి

విద్యాధరపురం, న్యూస్‌టుడే: బ్యాంకులో పని చేసే అధికారులకు ప్రాంతీయ భాషపై పట్టు ఉండాలని ముంబై అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వివేకానంద్ అన్నారు. పాతబస్తీలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజియనల్ కార్యాలయంలో హిందీ ప్రచార సభ (హైదరాబాద్) శుక్రవారం నిర్వహించిన తెలుగు శిక్షణ కార్యక్రమంలో ముంబై అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వివేకానంద్ మాట్లాడుతూ.. ప్రాంతీయ భాషపై అవగాహన ఉన్నప్పుడు మాత్రమే అధికారులు విధుల్లో రాణిస్తారన్నారు. హిందీ ప్రచార సభ ప్రతినిధులు చంద్రదేవ్ కవే, పరీక్ష సంచాలకులు సురేష్ పూరి, అధ్యాపకులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. గతంలో అధిక సంఖ్యలో హిందీతో పాటు ప్రాంతీయ భాషలను నేర్పించామన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ విజయవాడ జోనల్ కార్యాలయం అధికారి భాస్కరరావు, ప్రతినిధులు వివేక్ సుధ, ఉద్యోగులు పాల్గొన్నారు.

వామపక్షాల ఐక్యతకు బర్దన్ విశేష కృషి



బర్దన్ చిత్రపటానికి నివాళులర్పించిన రామకృష్ణ, విల్సన్, వనజ, నాగేశ్వరరావు, మూర్తి తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: వామపక్షాల ఐక్యతకు ఏబీ బర్దన్ విశేష కృషి చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. శుక్రవారం దాసరిభవన్‌లో సీపీఐ పూర్వపు ప్రధాన కార్యదర్శి బర్దన్ శత జయంతి సభ నిర్వహించారు. ఈ సభలో రామకృష్ణ మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో బర్దన్ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. చివరి వరకు సిద్ధాంతానికి కట్టుబడి పనిచేశారని, తన యావదాస్తిని పార్టీకి దానం చేశారని గుర్తు చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ భాజపాకు వ్యతిరేకంగా లౌకికశక్తుల ఐక్యత కోసం బర్దన్ కృషి చేశారన్నారు. తమ ఉనికికే ప్రమాదం వస్తుందనే భయంతో తెదేపా, జనసేన పార్టీలు భాజపాతో అంటకాగుతున్నాయని విమర్శించారు. లడ్డూ వివాదాన్ని అడ్డం పెట్టుకొని రాష్ట్రంలో మత ఘర్షణలు సృష్టించేందుకు భాజపా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తితిదేను కేంద్రం తన ఆధీనంలోకి తీసుకోవాలని కుట్ర చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, అక్కినేని వనజ, ఓబులేసు, జాస్తి కిషోర్‌బాబు, డి.హరనాథ్, ఖాదర్ బాషా, జానకిరామ్, జె.వి.సత్యనారాయణ మూర్తి, చంద్రానాయక్, కాశియ్య, నజీర్, జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ఆర్థిక సాయం అభినందనీయం



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో భాగ్యలక్ష్మి, హనుమాన్‌గుప్తా, విజయశ్రీగుప్తా, విజయలక్ష్మి, యుగంధర్

మాచవరం, న్యూస్‌టుడే: స్థానిక ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గొల్లాస్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభా పురస్కారాలను అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా ట్రస్టు నిరంతరాయంగా పలు ప్రాంతాల్లో విద్యార్థులు, పేదలకు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా కళాశాల పూర్వ డైరెక్టర్ టి.విజయలక్ష్మి మాట్లాడుతూ పురస్కారాలు అందుకున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ట్రస్టీలు గోళ్ల హనుమాన్‌గుప్తా, విజయశ్రీ గుప్తాలు మాట్లాడుతూ ప్రతిభ ఉండి పేదరికంతో చదువుకోలేకపోతున్న విద్యార్థులను ప్రోత్సహించడమే ట్రస్టు ఆశయమన్నారు. ప్రభుత్వ ఐటీఐ, పాలిటెక్నిక్, ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన 21 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల నిమిత్తం రూ.2.10 లక్షలు అందించారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ఎం.కనకారావు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.విజయసారథి, తొండెపు హనుమంతరావు, కళాశాల వ్యాయామ విద్యా విభాగాధిపతి డి.యుగంధర్, మాటూరి సురేష్‌బాబు దంపతులు పాల్గొన్నారు.

బెజవాడ బార్ అసోసియేషన్‌కు వాటర్ కూలర్ బహూకరణ

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: బెజవాడ బార్ అసోసియేషన్‌కు పంజాబ్ నేషనల్ బ్యాంక్ వాటర్ కూలర్‌ను బహూకరించింది. బ్యాంకు డీజీఎం, సర్కిల్ హెడ్ అభిజిత్ సింహ కూలర్‌ను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో బీబీఏ అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి అరిగెల శివరామ ప్రసాద్, బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్, కంచర్ల రవి, పిల్లా రవి, జి.కె.చక్రవర్తి, సంపర శ్రీనివాస్, బ్యాంకు బ్రాంచి మేనేజర్ లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

అలరించిన బాలు స్వర సప్తాహం

గాంధీనగర్, న్యూస్‌టుడే: జేఎన్ఎస్ సరాగాల సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో బాలు స్వర సప్తాహం ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం కోకా కాలనీలో నిర్వహించారు. గాయనీ, గాయకులు చైతు, రజని, లిఖిత, శ్రావణి, సుప్రియ తదితరులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన పాటలను ఆలపించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు రూప్స్ చింతకాయల చిట్టిబాబు, డేవిడ్‌రాజు, బి.ఆంజనేయరాజు, చావా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో యువత భవిష్యత్తు నాశనం



మాట్లాడుతున్న గొల్లమూడి శేఖర్‌బాబు

పాయకాపురం(మధురానగర్), న్యూస్‌టుడే: యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గొల్లమూడి శేఖర్‌బాబు పిలుపు ఇచ్చారు. శుక్రవారం వాంబేకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, సోషల్ మీడియా ప్రభావం తగ్గించడంపై కార్యశాల జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకుంటే భవిష్యత్తు అంధకారం అవుతుందని, ఇదొక ప్రజారోగ్య సమస్యగా మారుతుందన్నారు. వీటికి అలవాటు పడిన విద్యార్థులు, యువకులు సర్వస్వం కోల్పోయి నిర్భాగ్యులవుతున్నారన్నారు. సోషల్ మీడియాకి బానిసలై మానసిక అనారోగ్యం వంటి సమస్యలతో బాధ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సైబర్ సంబంధ, లైంగిక వ్యసనాలు, ఆన్‌లైన్ ఆటలకు బానిసవులవుతున్నారన్నారు. వీటిని అధిగమించేందుకు వైద్యులు, కుటుంబసభ్యులు, స్నేహితుల సహకారంతో పాటు వ్యవస్థీకృత చికిత్స అవసరం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎస్.దేవమణి తదితరులు పాల్గొన్నారు.

కులమత తారతమ్యాలపై పోరాడిన కవియోధుడు జాషువా



జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నీరజ, చిత్రంలో అధ్యాపకులు

మాచవరం, న్యూస్‌టుడే: స్థానిక ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల(బాలికలు)లో కళాప్రపూర్ణ, మహాకవి గుర్రం జాషువా జయంతిని శుక్రవారం నిర్వహించారు. తెలుగు విభాగం అంతర్జాలంలో ఏర్పాటు చేసిన అతిథి ఉపన్యాస కార్యక్రమంలో చీరాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు కట్టెపోగు సురేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని 'జాషువా కవిత్వ తత్వం' అనే అంశంపై ఉపన్యసించారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో పదునైన, హృద్యమైన పద్య కవిత్వంతో కులమత తారతమ్యాలపై అలుపెరగని పోరాటం సల్పిన కవియోధుడు జాషువా అని ఆయన కొనియాడారు. కళాశాల ప్రిన్సిపల్ వి.నీరజ తొలుత జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జాషువా కవిత్వమే కాక ఆయన జీవితం కూడా అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బాలకృష్ణ, అరుణ, సుధారాణి, సత్యవాణి, ప్రసాదరావు, లావణ్య, నాగలక్ష్మి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

29న సాహితీ పురస్కారాల ప్రదానం

గాంధీనగర్, న్యూస్‌టుడే: గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తూ తెలుగు భాషా వికాసానికి కృషి చేసిన ఉపాధ్యాయులకు పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు గాంధీనగర్‌లోని రాజ్ యువరాజ్ వద్ద గల పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి, ప్రముఖ తెలుగు సాహితీవేత్త గుమ్మా సాంబశివరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఇదే వేదికపై హిందీ దివస్ వేడుకలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


వరద బాధితుల సమస్యలు పరిష్కరించండి: సీపీఎం

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే: పేర్లు నమోదు కాక, బ్యాంకు ఖాతాలు సరిగా లేక వరద సాయం అందడం లేదని, ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆపార్టీ సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావుతో కలిసి విస్తృతంగా పర్యటించారు. బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయం అందక సచివాలయాలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ వేలాది మంది బాధితులు తిరుగుతున్నారని తెలిపారు. ఎక్కడా సరైన సమాధానం దొరకడం లేదని, ఈ సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రత్యేకంగా అధికారులను ఏర్పాటు చేయాలని కోరారు. బీమా లేదని, పత్రాలు లేవంటూ అనేక మంది వాహనాల నష్టాన్ని నమోదు చేసుకోలేదన్నారు. వీటిన్నింటినీ పరిష్కరించాల్సిన యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, కలెక్టర్ కార్యాలయాల్లో ఫిర్యాదుల విభాగాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ పెద్దలు రాజకీయపరమైన, మత పరమైన వివాదాలను పక్కన పెట్టి కష్టాల్లో ఉన్న బాధితులను ఆదుకునే అంశంపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ పర్యటనలో ప్రవీణ్, సిహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోతున్న కార్మికులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: వరదల కారణంగా నష్టపోయిన భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన నగర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పరికరాలన్నీ వరదల్లో కొట్టుకుపోయాయని చెప్పారు. దీనికి సంబంధించి అధికారులు వివరాలు రాసేటప్పుడు ఇంటి నెంబర్లు కావాలని, వ్యాపారాలకు సంబంధించి రుజువులు, ధ్రువపత్రాలు కావాలని అడుగుతున్నారని, చాలా మందికి ఆధారాలు లేక నష్టపోతున్నారని చెప్పారు. అలాగే ఆటో, మినీ గూడ్స్ వాహనాల వారిని ఫైనాన్స్ కంపెనీలు ఇబ్బంది పెడుతున్నాయని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని కోరారు. సమావేశంలో ఇఫ్టూ నాయకులు షేక్ బాజి, కనకారావు, శ్రీను, భాస్కర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



చీర చూపిస్తున్న నిర్వాహకులు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : దసరా, వివాహాల సందర్భంగా నాణ్యమైన, ఆకర్షణీయమైన రంగుల్లో సరికొత్త వస్త్రాలను ప్రజలకు అందించేందుకు లబ్బీపేటలోని ఎ కన్వెన్షన్‌లో శుక్రవారం నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను స్టాల్స్‌లో ఉంచామని వెల్లడించారు. సిల్క్, కాటన్ చీరలు, బ్లౌజ్‌లు, కుర్తీలు, చీరలు, దుప్పట్లు, సల్వార్ మెటీరియల్, వివిధ డిజైన్ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మహారాష్ట్రకు చెందిన పైథాని సిల్క్, కర్ణాటకకు చెందిన బెంగళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్, కాషిదా సిల్క్, మధ్యప్రదేశ్‌కు చెందిన చందేరి, మహేశ్వరి సిల్క్ తదితర వస్త్రాలు కొలువుదీరినట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

స్కేటర్లకు అభినందనలు



పతకాలు సాధించిన స్కేటర్లతో శిక్షకులు దిలీప్, వరుణ్‌కృష్ణ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: సత్యనారాయణపురం జీవీఎస్ శాస్త్రి పార్కులోని బీఆర్ఎస్ఏ రోలర్ స్కేటింగ్ రింక్‌లో సాధన చేస్తున్న ఇరువురు స్కేటర్లను శుక్రవారం పలువురు అభినందించారు. కోయంబత్తూరులో జరిగిన సీబీఎస్ఈ సౌత్ జోన్-1 రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో అండర్-11 బాలుర విభాగంలో విజయ డానియేల్ రింక్-1లో పసిడి, రింక్-2లో రజత పతకాలు కైవసం చేసుకోగా.. సందు కోటేశ్వర్ రింక్-2లో కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. పసిడి పతకం గెలుచుకున్న విజయ డానియేల్ జాతీయ సీబీఎస్ఈ పోటీలకు అర్హత సాధించాడని బీఆర్ఎస్ఏ కార్యదర్శి బచ్చు మాధవీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో స్కేటర్లతో పాటు శిక్షకులు దిలీప్, వరుణ్‌కృష్ణలను అభినందించారు.

120 బస్తాల చౌకబియ్యం పట్టివేత

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే: 120 బస్తాల చౌకబియ్యాన్ని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. శాంతినగర్ నుంచి రెండు మినీ వ్యానుల్లో చౌక బియ్యం గుంటూరుకు వెళుతున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్, నున్న పోలీసులు దాడులు చేసిన రెండు వాహనాలను పట్టుకున్నారు. వాటిలో 120 బస్తాల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. వ్యాను డ్రైవర్లు వినోద్, తన్వీర్‌లను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో విద్యాధరపురం నాలుగు స్తంభాల కూడలికి చెందిన సువ్వాడ గోపికి చెందిన బియ్యంగా పోలీసులు గుర్తించారు. నున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫొటోగ్రాఫర్ శ్రీనివాసరెడ్డికి అవార్డు



గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ఉత్తర ప్రదేశ్ లలిత్ కళా అకాడమీ ప్రతిష్టాత్మక రాజ్య లలిత్ కళా అకాడమీ పురస్కారాన్ని నగరానికి చెందిన ఫొటోగ్రాఫర్ తమ్మా శ్రీనివాసరెడ్డి అందుకున్నారు. అకాడమీ నృత్య, నాటక, సంగీత, చిత్రలేఖన, ఫొటోగ్రఫీ రంగాల్లో దేశవ్యాప్తంగా పోటీలను నిర్వహించింది. ఈ పోటీల్లో విజయవాడకు చెందిన శ్రీనివాసరెడ్డి కేరళలోని తెయ్యం నృత్యంపై తీసిన ఫొటో డాక్యుమెంటరీ పురస్కారానికి ఎంపికైంది. లక్నోలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ మంత్రి లాల్జీ ప్రసాద్ నిర్మల్ నుంచి శ్రీనివాసరెడ్డి అవార్డు అందుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
63036 11232

విద్యుత్తు దీపాల ఏర్పాటు

స్పందనకు వందనం

సీతారాంపురం, న్యూస్‌టుడే: పాయకాపురం ప్రశాంతినగర్ నాగేంద్రస్వామి పుట్ట రోడ్డులో విద్యుత్తు దీపాలు వెలగడం లేదని స్థానికురాలు ఉష 'మేమున్నాం.. మీకు తోడుగా'కు సమాచారం అందించారు. ఈ విషయాన్ని సంబంధిత వీఎంసీ అధికారిణి విమల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు 27వ తేదీన 'ఈనాడు'లో సమస్య ప్రచురితమైంది. స్పందించిన విమల తమ సిబ్బందితో దీపాలను ఏర్పాటు చేశారు. పుట్ట రోడ్డులోని నివాసితులు హర్షం వ్యక్తం చేశారు.

సమస్య: వాంబే కాలనీ బాలాజీ టవర్స్ ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో ఈనెల 9వ తేదీ నుంచి నీరు నిలబడి ఉంది. ఫలితంగా దోమలు పెరుగుతున్నాయి.

-సీహెచ్ కృష్ణమోహన్, స్థానికుడు

సమాధానం: పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

-వి.రామకోటేశ్వరరావు, ఏఎంవోహెచ్, వీఎంసీ

—న్యూస్‌టుడే, సీతారాంపురం

పెట్రో కెమికల్స్ పెట్టుబడులకు ఏపీ అనుకూలం

- ఐదేళ్లలో గుజరాత్, ఆంధ్ర, ఒడిశాల్లో ఈ రంగంలో 3.7 లక్షల మందికి ఉపాధి
- కేంద్ర రసాయన, ఎరువుల శాఖ కార్యదర్శి నివేదితా శుక్లా



పారిశ్రామికవేత్తల సమావేశంలో మాట్లాడుతున్న నివేదితా శుక్లా

ఈనాడు, విశాఖపట్నం: గుజరాత్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌ల్లో మూడు పెట్రోకెమికల్, పెట్రో ఇండస్ట్రియల్ రీజియన్ (పీసీపీఐఆర్)ల ద్వారా రూ.2.43 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, 3.7 లక్షల మందికి ఉపాధి కల్పించాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర రసాయన, ఎరువుల శాఖ కార్యదర్శి నివేదితా శుక్లా వెల్లడించారు. వికసిత్ భారత్‌లో భాగంగా వచ్చే ఐదేళ్లలో ఆ లక్ష్యాలను చేరుకుంటామని ప్రకటించారు. పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్‌లో అనుకూల వాతావరణం కనిపిస్తోందన్నారు. అక్టోబర్ 17 నుంచి 19 వరకు ముంబయిలో కేంద్ర ప్రభుత్వం, ఫిక్కీ ఆధ్వర్యంలో 13వ ఇండియా కెమ్-2024 ప్రదర్శన జరగనుంది. ఈ నేపథ్యంలో విశాఖలో శుక్రవారం నిర్వహించిన పారిశ్రామికవేత్తల సమావేశంలో నివేదితా శుక్లా మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం పెట్టుబడిదారుల స్నేహపూర్వక వాతావరణం కనిపిస్తోంది. ఇక్కడ సువిశాల తీరప్రాంతం ఉంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మొదటి స్థానంలో ఉంది. కొత్త ప్రభుత్వం ఈ ఏడాది రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తెచ్చి, 1.3 లక్షల మందికి ఉపాధి చూపాలని లక్ష్యంగా పెట్టుకుంది. రసాయన, పెట్రో కెమికల్స్ రంగంలో ఎక్కువ పెట్టుబడులు ఏపీకి తీసుకువచ్చేలా ఇండియా కెమ్ ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలి. దేశ ఆర్థిక వ్యవస్థలో రసాయన, పెట్రో కెమికల్స్ రంగం చాలా కీలకమైంది. ప్రపంచ మార్కెట్‌లో మనం ఆరో స్థానంలో ఉన్నాం. ప్రస్తుతం రసాయన మార్కెట్ విలువ సుమారు 220 బిలియన్ డాలర్లుగా ఉంది. 2040 నాటికి రూ.లక్ష కోట్ల రూపాయలకు పెరుగుతుంది' అని చెప్పారు.

యువతకు శిక్షణ ఇవ్వాలి

విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ రసాయన, పెట్రో కెమికల్స్ రంగంలో ఉపాధి అవకాశాల కోసం యువతకు పెద్ద ఎత్తున నైపుణ్య శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చేవారి కోసం నిబంధనలు సరళతరం చేయాలని సూచించారు. రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ మాట్లాడుతూ నూతన పారిశ్రామిక విధానంతో ఈ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించడానికి వీలవుతుందన్నారు. ఈ ఏడాది కేంద్రం బడ్జెట్‌లో కేటాయించిన వంద పార్కుల్లో మూడు మన రాష్ట్రానికి కేటాయించాలని, వాటిలో ఒకటి ప్రత్యేకంగా కెమికల్ పార్క్ ఉండేలా చూడాలని కోరారు. ఏపీలో పీసీపీఐఆర్ ఉన్నప్పటికీ భారీ పరిశ్రమలేవీ రాలేదని.. దీని గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో ఇటీవలే మాట్లాడారని ఆయన చెప్పారు. రాష్ట్రంలో 30 పారిశ్రామికవాడల ఏర్పాటుకు అవసరమైన భూములు సేకరించామన్నారు. కార్యక్రమంలో కేంద్ర రసాయన, ఎరువుల శాఖ సంయుక్త కార్యదర్శి దీపాంకర్ అరోన్, గంగవరం పోర్టు సీఈఓ అమిత్ మాలిక్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సుదర్శన్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.



జగన్‌తో సమావేశమైన జిల్లా నేతలతోపాటు ఉన్న అనంతబాబు (వృత్తంలో)

కలిసికట్టుగా పని చేయండి

వైకాపా నేతలతో ఆ పార్టీ అధ్యక్షుడు జగన్

ఈనాడు, అమరావతి: 'ప్రజాసమస్యల పరిష్కారం కోసం గట్టిగా నిలబడండి.. ఇందుకోసం ఎక్కువ సమయాన్ని కేటాయించండి.. జిల్లాలోని పార్టీ నేతలంతా ఒక కుటుంబంలా, కలిసికట్టుగా పనిచేయాలి' అని వైకాపా అధ్యక్షుడు జగన్ ఆ పార్టీ నేతలకు సూచించారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నేతలతో సమావేశమయ్యారు. 'ప్రభుత్వం తీసుకునే ప్రజావ్యతిరేక నిర్ణయాలు, ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ప్రజల్లోకి వెళ్లేందుకు అందరూ సమన్వయంతో వ్యవహరించాలి' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల అధ్యక్షుల ఎంపికపై నేతలతో చర్చించారు. కాకినాడకు మాజీ మంత్రి కురసాల కన్నబాబునే కొనసాగించాలని నిర్ణయించారు. తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా బీసీ సామాజికవర్గానికిచెందిన మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను ఇప్పటికే నియమించినందున.. కోనసీమ జిల్లాకు ఎస్సీ సామాజికవర్గానికి అవకాశం కల్పించాలని నేతలు సూచించినట్లు తెలిసింది. దీంతో మాజీ మంత్రి పినిపె విశ్వరూప్‌ను కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా ఖరారుచేసినట్లు సమాచారం. ఈ సమావేశానికి ఇటీవలి ఎన్నికల్లో అమలాపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి వైకాపా అభ్యర్థిగా పోటీచేసి ఓడిన రాపాక వరప్రసాదరావు గైర్హాజరయ్యారు.

ఎమ్మెల్సీ అనంతబాబు ప్రత్యక్షం: కాకినాడ, కోనసీమ జిల్లాల వైకాపా నేతలతో జగన్ నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్సీ అనంతబాబు హాజరవ్వటం చర్చనీయాంశంగా మారింది. దళిత యువకుడి హత్య కేసులో నిందితుడిగా జైలుకు వెళ్లిన ఆయన ఇప్పుడు బెయిల్‌పై బయట ఉన్నారు. హత్య జరిగినప్పుడు ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఇప్పటికీ ఆ సస్పెన్షన్‌ను ఎత్తివేయలేదు. కానీ అనంతబాబు మాత్రం గతంలో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిర్వహించిన చాలా కార్యక్రమాలకు హాజరయ్యారు. ఇప్పుడు కూడా క్యాంపుకార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రత్యక్షమవడం గమనార్హం.

రూ.110 కోట్ల విలువైన మత్తు పదార్థాల స్వాధీనం

చెన్నై నౌకాశ్రయంలో పట్టివేత

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: చెన్నై నౌకాశ్రయంలో రూ.110 కోట్ల విలువైన మత్తు పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం రాత్రి వారు తెలిపిన వివరాల మేరకు... చెన్నై నౌకాశ్రయం నుంచి ఆస్ట్రేలియాకు ఓడలో వెళ్లనున్న కంటెయినర్‌లో రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. అందులో 112 కిలోల సూడోఎఫెడ్రిన్ అనే మత్తు పదార్థం ఉన్నట్లు గుర్తించారు. దీని రవాణాకు ఉపయోగించిన 2 లగ్జరీ కార్లతో పాటు రూ.3.9 లక్షలు స్వాధీనం చేసుకుని అబుతాహిర్, అహ్మద్ బాషా అనే ఇద్దరు ఏజెంట్లను అరెస్టు చేశారు. అనంతరం వారిని విచారించగా.. ఇదే విధంగా నాలుగుసార్లు ఆస్ట్రేలియాకు మత్తు పదార్థాలు తరలించారని, అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాకు ఇందులో ప్రమేయం ఉందని తేలింది. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన విరమణ

- మంత్రి హామీలకు సానుకూలంగా నిర్ణయం

ఈనాడు, అమరావతి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తమ ఆందోళన కార్యక్రమాలను విరమించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ నుంచి లభించిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు లేఖను వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుకు సచివాలయంలో శుక్రవారం అందజేశారు. ఇన్‌సర్వీస్ కోటాలో పీజీ వైద్యవిద్యకు కేటాయించిన సీట్లను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 85ను నిరసిస్తూ ఈ నెల 17 నుంచి పీహెచ్‌సీ వైద్యులు ఆందోళనలు చేస్తున్నారు. సంఘం ప్రతినిధులతో చేపట్టిన చర్చల్లో మంత్రి సత్యకుమార్ 85 జీఓను సవరిస్తామని, క్లినికల్ విభాగంలో 15% బదులు 20% సీట్లను అన్ని స్పెషాలిటీల్లో కేటాయిస్తామని తెలిపారు. సంఘంతో చర్చించిన తర్వాతే ఇన్‌సర్వీస్ కోటాలో సీట్ల కేటాయింపుపై నిర్ణయాలు తీసుకుంటామని, ఇతర డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. వీటిని స్వాగతిస్తూ..



ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుకు లేఖ అందిస్తున్న వైద్య సంఘం ప్రతినిధులు వినోద్, రాహుల్ తదితరులు

సంఘం ప్రతినిధులు వినోద్, రాహుల్, ఇతర వైద్యులు కృష్ణబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 17 నుంచి తాము విధుల్లో ఉన్నట్లు పరిగణించి వేతనాలు చెల్లించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు, ట్రైబల్ ఎలవెన్సులు చెల్లించాలని అందులో కోరారు.

నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదుకు ఆదేశం



బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదు చేయాలని బెంగళూరు తిలక్‌నగర ఠాణా పోలీసులను చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం శుక్రవారం ఆదేశించింది. ఎన్నికల బాండ్ల పేరిట పలువురు పారిశ్రామికవేత్తలను నిర్మలా సీతారామన్ బెదిరించి భాజపాకు నిధులు వచ్చేలా చేశారని జనాధికార సంఘర్ష పరిషత్తుకు చెందిన ఆదర్శ్ అయ్యర్ గతంలో తిలక్‌నగర ఠాణాలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. పోలీసులు ఫిర్యాదు తీసుకోకపోవడంతో ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారణ పూర్తి చేసిన న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించి, తదుపరి విచారణను అక్టోబరు 10కి వాయిదా వేశారు.

అక్కడికి నేనొచ్చినట్లు ఎవరూ చెప్పలేదు

'ఈనాడు' కథనానికి సీఐడీ పూర్వ డీజీ సునీల్‌కుమార్ వివరణ

ఈనాడు, అమరావతి: మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అరెస్టయిన రోజున తాను సీఐడీ గుంటూరు ప్రాంతీయ కార్యాలయానికి వచ్చినట్లు ఎవరూ వాంగ్మూలం ఇవ్వలేదని సీఐడీ పూర్వ డీజీ సునీల్‌కుమార్ తెలిపారు. 'కస్టడీలో రఘురామకు చిత్రహింసలు నిజమే' అనే శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఓ ప్రకటనలో ఆయన వివరణ ఇచ్చారు. "ఆరు నెలలకు మించి కాల్ డేటా ఉండదు. అదే విషయం టెలికం సంస్థలూ చెప్పాయి. అలాంటిది నా లొకేషన్ ఎలా వచ్చింది? అది అబద్ధం. రఘురామకృష్ణరాజుకు గాయాల్లేవంటూ ఇచ్చిన సర్టిఫికెట్‌కు గుంటూరు వైద్యులు కట్టుబడి ఉన్నారు. వారు వేరే విధంగా వాంగ్మూలం ఇవ్వలేదు, ఇవ్వరు కూడా. తప్పుడు సర్టిఫికెట్ ఇచ్చామని ఒప్పుకొంటే వారి డాక్టర్ సర్టిఫికెట్ రద్దవుతుంది. రఘురామకు గాయాలు ఉన్నాయని, కొట్టడంవల్లే అవి అయ్యాయని మిలటరీ ఆసుపత్రి వైద్యులు చెప్పలేదు. మిలటరీ డాక్టర్లు సివిల్ కోర్టులకు రారు, సాక్ష్యం చెప్పరు. అది ఆర్మీ యాక్టు వారికి కల్పించిన రక్షణ" అని సునీల్‌కుమార్ వివరించారు.

మార్చిలో ఇంటి నిర్మాణ సాయం పెంపు: మంత్రి కొలుసు

చాట్రాయి, న్యూస్‌టుడే: అందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో త్వరలో స్థలాల కొనుగోలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూల నిర్ణయం తీసుకోనున్నారని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు జిల్లా మర్లపాలెంలో శుక్రవారం నిర్వహించిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. మార్చిలో గృహనిర్మాణ సాయం మొత్తాన్ని పెంచుతామని, ఎంత పెంచాలనేదానిపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. సొంత స్థలం ఉన్న పేదలు వెంటనే గృహాలు నిర్మించుకునే అవకాశముందని పేర్కొన్నారు.



విజయం దక్కాలంటే..

విజయం సాధించాలంటే ప్రేరణ అవసరం. కానీ అదొక్కటే సరిపోదు. ప్రారంభించే ధైర్యం ఉండాలి. మొదలుపెట్టిన పనిని నిలకడగా కొనసాగించాలి. విమర్శలను సమర్థంగా ఎదుర్కోవాలి. అనిశ్చిత పరిస్థితులు, వైఫల్యాలను అధిగమించగల మానసిక బలం కావాలి. వీటన్నింటికీ ఆప్తుల అండదండలూ తోడవ్వాలి.

– హిమాన్షు త్యాగి, ఐఎఫ్ఎస్ అధికారి

కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై కేసు

- 'ముడా' అంశంపై లోకాయుక్త చర్యలు

ఈనాడు, బెంగళూరు: మైసూరు నగరాభివృద్ధి సంస్థ(ముడా) స్థలాల పంపిణీ అక్రమాల్లో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఆ రాష్ట్రంలో కేసు నమోదైంది. మైసూరు లోకాయుక్త ఎస్పీ ఉదేశ్ శుక్రవారం ఈ కేసు నమోదుచేశారు. ముడా అక్రమాలపై విచారణ చేపట్టిన సంబంధిత కోర్టు.. 3 నెలల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇటీవల లోకాయుక్తను ఆదేశించిన క్రమంలో ఈ చర్యలు చేపట్టారు. స.హ. కార్యకర్త స్నేహమయి కృష్ణ చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టిన కోర్టు ఈ తీర్పు వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముఖ్యమంత్రి ఏ1, ఆయన సతీమణి పార్వతి ఏ2, బావమరిది మల్లికార్జున స్వామి ఏ3, భూములు విక్రయించిన దేవరాజు ఏ4, ఇతరులను ఏ5 నిందితులుగా పేర్కొన్నారు. సీఎంపై భూ ఆక్రమణల నియంత్రణ, అవినీతి నిరోధక, ఫోర్జరీ, బినామీ ఆస్తుల పరిరక్షణ, అధికార దుర్వినియోగం తదితర అభియోగాల కింద పలు సెక్షన్లు పెట్టారు. ఈ క్రమంలో తన రాజీనామా కోసం విపక్షాలు చేస్తున్న డిమాండ్‌పై శుక్రవారం ఉదయం సిద్ధరామయ్య స్పందిస్తూ.. 'గోధ్రా కేసులో ఆనాటి గుజరాత్ సీఎం నరేంద్రమోదీ రాజీనామా చేశారా? అక్రమ గనుల తవ్వకాల కేసులో బెయిల్‌పై ఉన్న కేంద్రమంత్రి కుమారస్వామి నుంచి ప్రధాని రాజీనామా కోరారా?' అంటూ ప్రశ్నించారు. తాను తప్పు చేయలేదని, రాజీనామా చేయనని స్పష్టం చేశారు.

రాజీనామా చేయాల్సిన అవసరం లేదు: ఖర్గే



విలేకర్లతో మాట్లాడుతున్న సిద్ధరామయ్య

సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన అవసరంలేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. శుక్రవారం ఆయన బెంగళూరులో విలేకర్లతో మాట్లాడుతూ.. కేసు నమోదు చేయగానే సిద్ధరామయ్య రాజీనామా చేయాలంటే.. గోధ్రా కేసులో మోదీ రాజీనామా చేశారా? అమిత్ షా పైనా కేసులున్నాయి కదా? అని గుర్తు చేశారు. సీబీఐకి సాధారణ సమ్మతి ఉపసంహరణ చర్యనూ ఖర్గే సమర్థించారు.



ఆల్బమ్ ఆవిష్కరిస్తున్న గద్దె అనూరాధ, బొండా సుజాత, నిర్వాహకులు

ఆకట్టుకుంటున్న నగల ప్రదర్శన

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : నగరంలోని మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీ ఎ ప్లస్ కన్వెన్షన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే పాన్ ఇండియా జ్యూయలరీ ప్రదర్శనను శుక్రవారం జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ, బొండా సుజాత ప్రారంభించారు. నిర్వాహకులు సజ్జా అన్నపూర్ణ, నిరంజన్ మాట్లాడుతూ... రానున్న పండగలు, వివాహాది శుభకార్యాల సందర్భంగా బంగారం, వజ్రాభరణాల కొనుగోలుకు జైపూర్, ముంబాయి, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, దేశంలోనే ప్రఖ్యాతి గాంచిన ఆభరణాల నిర్వాహకులు ఈ ప్రదర్శనలో 30కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారని, ఇక్కడే కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. అనేక రకాల డిజైన్లలో వజ్రాభరణాలు తమ స్టాల్స్‌లో అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. ఈ నెల 29న రాత్రి 8 గంటల వరకు మాత్రమే ప్రదర్శన ఉంటుందని, ప్రజలు సందర్శించాలని కోరారు.

రాకెట్‌లా దూసుకుపోతూ..

బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్న చరిష్మ

70 వరకు పతకాలు కైవసం

ఈనాడు డిజిటల్, అమరావతి

బుడిబుడి అడుగుల ప్రాయంలోనే రాకెట్ (బ్యాడ్మింటన్) పట్టుకుంది.. కిందపడి దెబ్బలు తగిలినా.. పట్టువీడకుండా సాధన చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాల సాధిస్తోంది. విజయవాడలోని సీతారాంపురానికి చెందిన తమిరి సూర్య చరిష్మ తండ్రి నవీన్‌బాబుతో రోజూ ఉదయం వ్యాయామం కోసం బ్యాడ్మింటన్‌ను అలవాటు చేసుకుంది. తండ్రి సాధన చేస్తూ.. విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో చరిష్మ రాకెట్ పట్టుకుని చురుగ్గా ఆడేది. కుమార్తె ఆసక్తిని గుర్తించి తండ్రి నవీన్ బ్యాడ్మింటన్ కోచ్ భాస్కర్ వద్ద చేర్పించారు. ఇంటికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియానికి సైకిల్ మీద వెళ్లి సాధన చేసేది. కరోనా సమయంలో కూడా ఆన్‌లైన్‌లో మెలకువలు నేర్చుకుంది. ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో అన్ని విభాగాల్లో కలిపి 70 వరకు పతకాలు సాధించింది.

సాధించిన విజయాలు కొన్ని..

★★ 2022లో బెంగళూరులో జరిగిన జూనియర్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో బంగారు పతకం. ★★ 2023లో 37వ నేషనల్ గేమ్స్‌లో, హైదరాబాద్‌లో జరిగిన జూనియర్ ఇంటర్నేషనల్ సింగిల్ విభాగంలో రజత పతకాలు. ★★ 2024 హైదరాబాద్, తమిళనాడు, జరిగిన యూత్ గేమ్స్, జూనియర్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో బంగారం పతకాలు. ★★ 2024 ఫిబ్రవరిలో బెంగళూరులో జరిగిన సీనియర్ ర్యాంకింగ్ టోర్నమెంట్ లో సింగిల్ విభాగంలో వెండి పతకాలు సాధించింది.



ఒలింపిక్స్‌లో పతకం గెలవాలి

క్రీడలే నా భవిష్యత్తు. చదువుతూ.. నిరంతరం సాధన చేస్తున్నాను. మాలాంటి వారిని ప్రభుత్వం ఆర్థికంగా ప్రోత్సహిస్తే మరింత రాణిస్తాం. ఒలింపిక్స్‌లో పాల్గొని దేశానికి పతకం సాధించడమే లక్ష్యం.

- తమిరి సూర్య చరిష్మ

ఐదునెలలు మంచానికే పరిమితం..

ఆటలో మునిగిపోయి.. చరిష్మ చదువును ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. క్రీడా విభాగంలో ఛత్తీస్‌గఢ్‌లోని ఓ యూనివర్సిటీలో డిగ్రీ సీటు ఉచితంగా సాధించింది. 2022లో సాధన చేస్తున్న క్రమంలో కుడికాలికి తీవ్ర గాయమైంది. పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించడంతో ఐదు నెలలు ఇంటికే పరిమితమయ్యింది. తరువాత కోలుకుని సాధన మొదలు పెట్టింది.

జగన్మాత సేవలో కర్ణాటక మంత్రి

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను కర్ణాటక అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే శుక్రవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ జగదీష్ ఆయనకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



మంత్రి ఈశ్వర్ ఖండ్రేకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న సూపరింటెండెంట్ జగదీష్

కళాంజలిలో సరికొత్త కలెక్షన్

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : విజయవాడ సిద్ధార్థ మహిళా కళాశాల రోడ్డులోని కళాంజలిలో దసరా, దీపావళి పండగల సందర్భంగా సరికొత్త డిజైన్లు సిద్ధంగా ఉన్నాయి. ఆధునికత, నాణ్యత, అందుబాటు ధరల్లో లభించే దుస్తులు వినియోగదారులను ఆకట్టుకున్నాయి. అత్యాధునిక డిజైన్లు, ఆకర్షణీయమైన రంగులతో కూడిన సల్వార్స్, పలాజో, ఛూడీ, అనార్కలీ మోడల్స్ కొలువుతీరాయి.



సల్వార్ సూట్స్ ధరించిన యువతులు

ప్రత్యేక రాయితీలు

పండగల సందర్భంగా అన్ని రకాల డిజైన్లు, డ్రెస్‌లపై 30 శాతం రాయితీ, సరికొత్త స్టాక్‌పై ఒకటి కొంటే మరొకటి ఉచితంగా అందిస్తున్నారు. ముఖ్యంగా అనార్కలి, స్ట్రయిట్, షార్ట్‌టాప్ విత్ పలాజో, లాంగ్ గౌన్లు, గాగ్రాస్, క్రాప్ టాప్స్‌పై కూడా ప్రత్యేక రాయితీ ఉంది. టాప్స్, కుర్తీస్, లెగ్గింగ్స్ అందుబాటులో ఉన్నాయి. అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే కొలికపూడి తీరుపై శ్రేణుల నిరసన

కరెన్సీనగర్(విజయవాడ): తిరువూరు శాసనసభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు తీరుపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. మహిళల ఆత్మగౌరవంతో పుట్టిన తెదేపాలో వేధింపులు పాల్పడడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. మూడు నెలల కిందట పార్టీలోకి వచ్చిన ఎమ్మెల్యే ఆగడాలను ఆదిలోనే అరికట్టాలని పిలుపునిచ్చారు. నాలుగు రోజుల కిందట చిట్టేల సర్పంచి తుమ్మలపల్లి శ్రీనివాసరావును అసభ్య పదజాలంతో ఎమ్మెల్యే దూషించగా.. ఆయన భార్య కవిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆమె ప్రస్తుతం విజయవాడ ఆయుష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో పార్టీ శ్రేణులు ఘటనకు కారణమైన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలంటూ ఆసుపత్రి వద్ద నినాదాలు చేశారు. బాధితుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 'అధికార అహంతో గుడ్డలు ఊడదీసి కొడతాననడం సభ్య సమాజం హర్షించడం లేదు. 30 ఏళ్లుగా తెదేపాను నమ్ముకున్న మాపై దుర్భాషలాడారు. ఎమ్మెల్యే భాష సరిగా లేదు. మహిళలు, యువత ఇబ్బందులు పడుతున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎంపీ కేశినేని శివనాథ్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. చరవాణుల్లో మెసేజ్‌లు పెడుతూ తమ ప్రతిష్ఠను దిగజార్చుతున్నారని, విలేకరులపైనా నోరు పారేసుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.



ఆస్పత్రి ఎదుట నినాదాలు చేస్తున్న తెదేపా కార్యకర్తలు

'కొలికపూడి' గ్రావెల్, ఇసుక, మద్యం, బియ్యం అక్రమదందా

- పల్లా శ్రీనివాసరావుకు తిరువూరు తెదేపా నాయకులు, కార్యకర్తల ఫిర్యాదు

ఈనాడు డిజిటల్, అమరావతి : నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అరాచకాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోందని తిరువూరుకు చెందిన తెదేపా నాయకులు, కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలని కూడా చూడకుండా నోటికొచ్చినట్టు దుర్భాషలాడుతున్నారని వాపోయారు. నియోజకవర్గంలో గ్రావెల్, ఇసుక, మట్టి, రేషన్ బియ్యాన్ని దోచుకుంటూ సొమ్ముచేసుకుంటున్నారని.. ఇదేంటని ప్రశ్నిస్తే దుస్తులు ఊడదీసి కొడతానని పార్టీ శ్రేణుల్ని నోటికొచ్చినట్టు తిడుతున్నారని మండిపడ్డారు. చిట్టేల సర్పంచి శ్రీనివాసరావునూ నడిరోడ్డు మీద ఇష్టారీతిన దుర్భాషలాడారని ఆవేదన వ్యక్తం చేశారు. కొలికపూడి వేధింపులు భరించలేకే శ్రీనివాసరావు సతీమణి కవిత ఆత్మహత్యాయత్నం చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు 35 మంది కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. కొలికపూడి ఉంటే నియోజకవర్గంలో పార్టీ బతకదని తేల్చిచెప్పారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జిని నియమించాలని కోరారు. ఆయన దోపిడీని, అరాచకాల్ని ప్రశ్నిస్తున్నందుకే 30 ఏళ్లుగా పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నవారినీ లక్ష్యంగా చేసుకొని వేధిస్తున్నారని వెల్లడించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ వివాదంపై కొలికపూడిని పిలిచి మాట్లాడతామని పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. "కొలికపూడి వేధింపులతో నాయకులు తిరిగే పరిస్థితి లేదు. మాకీ ఎమ్మెల్యే వద్దు" అని బోయపాటి సునిత పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి మనుషుల్ని తెప్పించుకొని ఎమ్మెల్యే దౌర్జన్యం చేస్తున్నారని అనుమోలు వెంకటేశ్వరరావు ఆరోపించారు. ముక్కూమొహం తెలియని కొలికపూడిని పార్టీ మీద గౌరవంతో గెలిపిస్తే...వైకాపా వాళ్లకు పనులు చేసిపెడుతూ....తమను వేధిస్తున్నారని నాగరాజు వాపోయారు.

ఫేస్‌బుక్ వేదికగా సంచలన ప్రకటన

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో తాజాగా చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఫేస్‌బుక్ వేదికగా శుక్రవారం చేసిన సంచలన ప్రకటన చర్చనీయాంశంగా మారింది. 'అగ్నిపర్వతం బద్దలయ్యే ముందు.. భయంకరమైన ప్రశాంతంగా ఉంటుంది' అంటూ ఆయన చేసిన పోస్టు వైరల్‌గా మారింది.

పాఠశాలలో కీచక పర్వం

- ఉన్నతాధికారులకు ఉపాధ్యాయుల ప్రవర్తన చిట్టా
- 'లెక్క' తేల్చాలని తల్లిదండ్రుల ఆందోళన

న్యూస్‌టుడే, గుడివాడ గ్రామీణం

భావి పౌరులను తీర్చిదిద్దాల్సిన దేవాలయాలు బూతులకు, చిన్నారులపై అఘాయిత్యాలకు నెలవుగా మారుతున్నాయి. గుడివాడ మండలం చౌటపల్లి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న కీచక పర్వం దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. ఓ ఉపాధ్యాయుడిపై ఫోన్ ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు గుడివాడ ఉప విద్యాశాఖాధికారి పద్మారాణి వారం రోజుల కిందట పాఠశాలకు వెళ్లి విచారించగా నాలుగో తరగతి విద్యార్థినిని వేధింపులకు గురిచేసి గురువారం అరెస్టు అయిన పీడీ చంద్రశేఖర్‌పై ఆరోపణలు వచ్చినట్లు తెలుస్తోంది. పద్ధతి మార్చుకోకుంటే క్రమశిక్షణా చర్యలు తప్పవని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులను ఆమె హెచ్చరించారు. విద్యార్థులపై వేధింపులు, వెకిలి చేష్టలకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఆరోపణల దృష్ట్యా సంబంధిత ఉపాధ్యాయులను గట్టిగా మందలించినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే తనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినందుకు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడు పీడీ చంద్రశేఖర్ ప్రవర్తనపై విద్యార్థుల తల్లిదండ్రులను రెచ్చగొట్టారని సమాచారం. ఇందులో భాగంగానే బాలికపై అసభ్యంగా ప్రవర్తించినందుకు ఆమె తల్లి పీడీ చంద్రశేఖర్‌ను పాఠశాలలోనే చెప్పుతో కొట్టారు. అనంతరం మహిళా పోలీసు సమక్షంలో ఫిర్యాదు చేశారు. పాఠశాలలో చంద్రశేఖర్‌తోపాటు మరో ఉపాధ్యాయుడు కూడా చిన్నారులను వేధిస్తున్నారని అతని 'లెక్క' కూడా తేల్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై గ్రామస్థులు పాఠశాలలోని ఉపాధ్యాయులందర్నీ తొలగించాలని కోరుతున్నారు.

బ్యాడ్ టచ్‌పై డీవైఈవో విచారణ.. గుడివాడ ఉప విద్యాశాఖాధికారిణి పద్మారాణి శుక్రవారం చౌటపల్లి పాఠశాలలో బ్యాడ్ టచ్ వ్యవహారంపై విచారణ చేపట్టారు. ప్రతి విద్యార్థినీ విచారించి ఉపాధ్యాయుల ప్రవర్తన ఎలా ఉంది? బాలికలతో ఎలా వ్యవహరిస్తున్నారు? మాటతీరు గురించి పూర్తి వివరాలను లిఖిత పూర్వకంగా తీసుకొని ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కూడా ఉపాధ్యాయుల ప్రవర్తనపై ఆరా తీశారు.

చంద్రశేఖర్ సస్పెన్షన్... నాలుగో తరగతి బాలికను బ్యాడ్ టచ్ చేసిన వ్యవహారంలో పీడీ ఎం.చంద్రశేఖర్ అరెస్టు కావడంతో అతడ్ని సస్పెండ్ చేశామని డీవైఈవో పద్మారాణి తెలిపారు. అరెస్టు చేసి 24 గంటలు దాటిన వెంటనే అతడ్ని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ నుంచి వచ్చిన ఉత్తర్వులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అందించామన్నారు.